
శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఈవో అబ్రహం

మెరుగైన బోధనకే 'సాల్ట్' శిక్షణ : డీఈవో

ఏలూరు ఎడ్యుకేషన్, జూలై 3 : తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధనా మెలకువలు, విద్యార్థుల వైఖరిని గుర్తించేందుకు 'సాల్ట్' ప్రోగ్రాంలో భాగంగా నిర్వహిస్తోన్న టీచర్ టూల్ శిక్షణా కార్యక్రమం ఉపకరిస్తుందని డీఈవో అబ్రహం అన్నారు. ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంలు, సీనియర్ టీచర్లకు సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ తరగతులను బుధవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధనను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కోర్సు డైరెక్టర్, ఏలూరు ఎంఈవో-2 రంగయ్య, మాస్టర్ ట్రైనర్లు సత్యనారాయణ, వహీదా బేగం, జయకుమార్, స్వర్ణలత, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్

- స్వచ్ఛందంగా మూసివేతకు ప్రైవేటు యాజమాన్యాల నిర్ణయం

ఏలూరు ఎడ్యుకేషన్, జూలై 3 : దేశవ్యాప్తంగా ఎన్‌టీఏ నిర్వహించిన నీట్-యూజీ పరీక్ష ప్రశ్నపత్రం లీక్‌ను వ్యతిరేకిస్తూ పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ తదితర విద్యార్థిసంఘాలు గురువారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.నాని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి అఖిల్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎస్.మోహన్, క్రాంతి, చందన్, వెంకటేశ్వరరావు, హుస్సేన్ తదితరులు కోరారు. బంద్‌లో పాఠశాలలు మొదలుకుని డిగ్రీ, ఇంజనీరింగ్, తదితర కళాశాలలన్నీ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాగా విద్యాసంస్థల బంద్‌కు స్వచ్ఛందంగానే సహకరించాలని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు నిర్ణయించాయి. ఆ మేరకు గురువారం ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించాయి.


పట్టిసీమ ఎత్తిపోతల పథకం స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న మంత్రి నిమ్మల, చిత్రంలో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యేలు బాలరాజు, ధర్మరాజు


ఎత్తిపోతల పథకం వద్ద విడుదలవుతున్న నీటిని పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల, కలెక్టర్, ఎమ్మెల్యేలు

గోదారి నీరొచ్చే.. మెట్ట మురిసె!

ఒకేసారి పట్టిసీమ, తాడిపూడి నీటి విడుదల

- రైతుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం
- ప్రత్యేక కార్యాచరణతో కూటమి ప్రభుత్వం ముందడుగు
- ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులు పూర్తి : మంత్రి నిమ్మల

గోదావరి జలాలను పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల ద్వారా ఒకేరోజు నీటిని విడుదల చేయడం, ఒక అరుదైన రికార్డు. ఈ రికార్డును బుధవారం జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు సాధించగలిగారు. గోదావరిపై వున్న ఎత్తిపోతల పథకాల ద్వారా ఒకేసారి రైతులకు సాగు నీరందితే ఖరీఫ్ సజావుగా సాగుతుందని, పంటలు చేతికి వస్తాయని, పెట్టుబడులతోపాటు తగినంత రాబడి, రైతుకు కలిసి వస్తుందన్న పక్కా ప్రణాళికలతో పట్టిసీమ, తాడిపూడి రెండు ఎత్తిపోతల ద్వారా ప్రజా ప్రతినిధులు, అధికారులు వెంట రాగా ఆర్భాటంగా గోదావరి జలాలను విడుదల చేశారు. తొలుత పట్టిసీమ ఎత్తిపోతల నుంచి కొన్నాళ్ళు ఆగిన తర్వాత తాడిపూడి నుంచి నీటిని విడుదల చేసేవారు. ఈ సారి ఒకేసారి ఒకే తేదీన సాగు నీరందించాలన్న ప్రభుత్వం తన లక్ష్యాన్ని అమలు పరిచింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

పట్టిసీమ నుంచి 8 వేల క్యూసెక్కులు నీటి విడుదలే లక్ష్యంగా విడుదలకు శ్రీకారం చుట్టారు. మరో రెండు, మూడు రోజుల్లో కాల్వల్లో ఆ మేరకు నీటి సామర్థ్యం మేర ప్రవాహం ఉంటుందని ఇంజనీర్లు చెబుతున్నారు. ఇప్పటికే కృష్ణా నదిలో నీరు అతి తక్కువగా ఉండడంతో గోదావరి వరద జలాలు పట్టిసీమ ద్వారా ప్రకాశం బ్యారేజీకు చేరుకోనున్నాయి. ఇది కాస్త కృష్ణా డెల్టా రైతులకు అతిపెద్ద అదృష్టంగా భావిస్తున్నారు. వాస్తవానికి 2018లో పట్టిసీమ నుంచి సాగునీటి విడుదల ద్వారా కృష్ణా డెల్టాలో అత్యధిక పంట దిగుబడి రికార్డు అయింది. ఇదంతా పట్టిసీమ నుంచి వచ్చిన గోదావరి జలాలే కారణమంటూ రైతులు గోదారమ్మకు పూజలు చేశారు.

తాడిపూడి ఎత్తిపోతలకు మహర్దశ

ఇరవై ఏళ్ల క్రితం ప్రారంభించిన తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా ఈ సారి జూలైలోనే గోదావరి జలాలను విడుదల చేయడం ఒక రికార్డు. వాస్తవానికి మెట్ట ప్రాంతానికి నీరందించే క్రమంలోనే రెండు దశాబ్దాల క్రితం తాడిపూడి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. రెండు లక్షల ఎకరాలకు పైగా సాగు నీరు, మరో వందలాది గ్రామాలకు తాగు నీరు అందించే ఉద్దేశంతో ఈ పథకానికి నాంది పలికారు. 2014-19 మధ్య తిరిగి చంద్రబాబు సీఎంగా వున్న సమయంలో తాడిపూడిపై అప్పటి వరకు గత ప్రభుత్వాలు అనుసరించిన నిర్లక్ష్య విధానాలకు స్వస్తి పలుకుతూ ఈ ఎత్తిపోతలకు జీవం పోశారు. 2017-19 మధ్య తొలిసారిగా లక్ష ఎకరాలకు సాగు నీటిని అందించేందుకు నీటి విడుదల సామర్థ్యాన్ని క్రమేపీ పెంచారు. తిరిగి 2019-24 మధ్య మళ్ళీ ఈ పథకానికి గ్రహణం పట్టింది. తిరిగి మరోసారి ఈ ఎత్తిపోతలకు మహర్దశ పట్టబోతోంది. తాడిపూడి ఎత్తిపోతల ద్వారా లక్షన్నర ఎకరాలకు సాగు నీరు అందించి తీరుతామని, మంత్రి నిమ్మల ప్రకటించారు. ఈ పథకాన్ని విస్తరిస్తూ 2018లోనే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి పశ్చిమ నుంచి కృష్ణా జిల్లా శివారు వరకు గోదావరి జలాలను తరలించేందుకు వీలుగా ఈ ఎత్తిపోతల పథకం వ్యయం రూ.1,700 కోట్లు నుంచి రూ.4,900 కోట్లు పెంచుతూ అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడమే కాకుండా పనులను ప్రారంభించింది. 2019లో తెలుగుదేశం ఓటమి అనంతరం తాడిపూడి కాల్వ పనులు నిలిచి పోయాయి. ఇప్పుడు తిరిగి మెట్ట ప్రాంతమైన నూజివీడు, మైలవరం, గన్నవరం ప్రాంతాలకు గోదావరి జలాలను తరలించే క్రమంలో ఈ ఎత్తిపోతలకు రాబోయే బడ్జెట్‌లోనూ పూర్తిస్థాయి ప్రభుత్వ సహకారం ఉంటుందని భావిస్తున్నారు.

సంబరమే సంబరం

ఒకేసారి పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల నుంచి గోదావరి జలాలు విడుదల కావడంతో ఆయా ప్రాంతాల రైతుల్లో హర్షామోదాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే తొలకరి ఆరంభమైనా రైతులకు సంతృప్తికరంగా సాగు నీరందడం లేదు. పగటి ఉష్ణోగ్రతలు తగ్గకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఖరీఫ్ ఈసారి ఆలస్యమైంది. ఈ పరిణామ క్రమంలోనే ప్రకాశం బ్యారేజ్ నుంచి పట్టిసీమ నీరు కృష్ణా డెల్టాకు జీవం పోయనుండటంతో ఆ ప్రాంత రైతుల్లో ఆనందం వెల్లివెరిసింది.

ఇదంతా చంద్రబాబు దయ : మంత్రి నిమ్మల

'సాగునీటి ప్రాజెక్టులకు ప్రాణం పోస్తున్నారు. గతంలో నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టినట్లే అదే పంథాలో ప్రాధాన్యత క్రమంలో సాగునీటి పథకాలు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు మరింత చొరవ తీసుకుంటున్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడమే కాకుండా సాగునీటి పథకాలను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆ క్రమంలోనే రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల పథకాల ద్వారా నేడు గోదావరి జలాలను విడుదల చేశా' అని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. మెట్టను గోదావరి జలాలతో తడపడం ద్వారా వందలాది మంది రైతులకు ఊతమివ్వబోతున్నారని, తద్వారా పట్టిసీమ పథకాన్ని ఇప్పటికే బంగారు పథకంగా మార్చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని మంత్రి అన్నారు. పట్టిసీమ, తాడిపూడి నుంచి గోదావరి జలాలను విడుదల చేసిన అనంతరం గోదారమ్మకు పూజలు చేసి పూలు, వస్త్రాలు సమర్పించారు. పట్టిసీమ వద్ద మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 'పోలవరం పూర్తయ్యేలోగా దానిలో కొంతమేర అయినా సాగుకు, తాగునీటికి వినియోగించేందుకు సీఎం 2014లోనే నదుల అనుసంధానంలో భాగంగా పట్టిసీమ ఏర్పాటు చేశారు. ఈ పథకం ద్వారా 20 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాలోని సాగు, తాగునీటికి వినియోగిస్తున్నారు. ఒకేరోజు పట్టిసీమ, తాడి పూడే కాకుండా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని విడుదల చేయడం ఓ రికార్డు. తాడిపూడి ద్వారా 875 క్యూసెక్కులు, పురుషోత్తపట్నం ద్వారా 3,500 క్యూసెక్కులు, పుష్కర ఎత్తిపోతల ద్వారా 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి, ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వను పెంచుతాం. ఉత్తరాంధ్రకు సాగు, తాగు నీరందేలా చూస్తాం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నీరందిస్తాం. పోలవరం ప్రాజెక్టు సమస్యలు త్వరలోనే తీరనున్నాయి'.. అంటూ తెలిపారు. నీటి విడుదల కార్యక్రమంలో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు, పత్సమట్ల ధర్మరాజు, ఐటీడీఏ పీవో సూర్యతేజ, ఇరిగేషన్ ఎస్ఈ నరసింహమూర్తి, ఈఈ ఏసుబాబు, డీఈ పెద్దిరాజు, రాష్ట్ర సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వెంకట గోపాల కృష్ణారావు, ఆర్డీవో అద్దయ్య తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచ్ శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ అనిత సమారి, మాజీ ఎమ్మెల్యే బొరగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్

పోలవరం జూలై 3 : పోలవరం ప్రాజెక్టుని కలెక్టర్ వెట్రి సెల్వి బుధవారం పరిశీలించారు. కలెక్టరుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె తొలిసారి ప్రాజెక్టుని సందర్శించారు. తొలుత ప్రాజెక్టు హిల్ వ్యూ నుంచి ప్రాజెక్టుని పరిశీలించిన కలెక్టర్‌కు సంబంధిత వివరాలను మ్యాప్ పాయింటింగ్ ద్వారా ఈఈ పి.వెంకరమణ వివరించారు. పోలవరం ప్రాజెక్టులో స్పిల్‌వే, ఎగువ కాఫర్ డ్యాం, పవర్ హౌస్ ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ప్రాజెక్టు నమూనాను పరిశీలించారు. సంబంధిత వివరాలను ఇంజనీర్లు మ్యాప్ పాయింటింగ్, నమూనాలను చూపించి వివరించారు. ఐటీడీఏ పీవో సూర్యతేజ, ఆర్డీవో అద్దయ్య, ఈఈ మల్లిఖార్జునరావు, తహసీల్దారు ప్రసాద్, ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.



చిగురిస్తున్న ఆశలు

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన నూజివీడు మామిడి స్థానికులు, రైతులకు మాత్రం చేదు ఫలమే. మామిడి ఉత్పత్తికి పరిశోధనలు, ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో రైతులకు ప్రయోజనం కల్పించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడానికి పాలకులు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. తాజాగా ఏర్పడిన టీడీపీ కూటమి ప్రభుత్వం మామిడి రైతుల్లో ఆశలు చిగురింపచేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రాసెస్ యూనిట్ ఏర్పాటు, మామిడి పరిశోధన కేంద్రం పటిష్టతకు రైతులతో చర్చించి చర్యలు చేపట్టడానికి మంత్రి కొలుసు పార్థసారథి సన్నద్ధమయ్యారు.

(నూజివీడు)

నేడు మామిడి రైతులతో మంత్రి కొలుసు సమావేశం

- ఎన్నికల హామీ అమలుకు మంత్రి సన్నద్ధం
- మామిడి మార్కెట్ ఏర్పాటుపై సమీక్ష
- గత ప్రభుత్వం చేసింది శూన్యం..
- కూటమి ప్రభుత్వం రాకతో మామిడికి పూర్వవైభవం వస్తుందని రైతుల ఆశాభావం


నూజివీడు ఏఎంసీ మార్కెట్‌యార్డు

ప్రసిద్ధి పొందిన నూజివీడు మామిడి రైతులకు ప్రోత్సాహకంగా లేకపోవడం, మామిడి రైతుపై గత ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి కారణంగా ఈ ప్రాంతంలో మామిడి తోటలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. చీడపీడల ఉధృతి, నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రంలోని పరిశోధనలు క్షేత్రస్థాయిలో రైతులకు చేరకపోవడంతో మామిడి రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు వెళుతున్నారు. ఫలితంగా ఈ ప్రాంతంలోని గ్రీన్ బెల్ట్ కూడా దెబ్బతింటోంది. గత ప్రభుత్వాలు మామిడి రైతులకు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చకపోవడం నిరాశ కలిగిస్తోంది. 2008లో ప్రారంభించిన మ్యాంగో ప్రాసెసింగ్ యూనిట్, మామిడి పరిశోధనా కేంద్రం నిలిచి పోయింది. మామిడి పరిశోధనా కేంద్రంలో శాస్త్రవేత్తలను నియమించినా, ప్రయోగాలకు అవసరమైన క్షేత్రస్థాయి మౌలిక సదుపాయాల కల్పనలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయి. మామిడి పరిశోధనకు కనీసం 200 ఎకరాల భూమి అవసరం కాగా నేటికీ కేటాయించలేదు. 11 ఏళ్ల క్రితం నూజివీడు కేంద్రంగా మామిడి మార్కెట్ ఏర్పాటు చేస్తామని, ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ అతీగతీ లేదు. తాజాగా జరిగిన ఎన్నికల్లో కొలుసు పార్థసారథి మామిడికి పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా అడుగులు వేస్తామని, నూజివీడు కేంద్రంగా మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. నూజివీడు ఎమ్మెల్యే ఎన్నికైన ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో హామీలను అమలుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. నూజివీడు ఏఎంసీ కేంద్రంగా మామిడి మార్కెట్ ఏర్పాటు చేసేందుకు గురువారం ఏఎంసీలో మామిడి రైతులు, ఎగుమతిదారులు, అధికారులు, వ్యాపారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎంతోకాలంగా నిరాశతో ఉన్న రైతులకు మామిడి ఎగుమతి అవకాశాలు మెరుగయ్యే దిశగా ఆశలు చిగురిస్తున్నాయని చెప్పవచ్చు.

ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నూజివీడు డివిజన్ పరిధిలో దాదాపు 40వేల హెక్టార్లలో మామిడి తోటలు విస్తరించాయి. జిల్లాల పునర్విభజనలో నూజివీడు నియోజకవర్గం ఏలూరు జిల్లాలో అంతర్భాగమైంది. ప్రస్తుత నూజివీడు డివిజన్‌లోని నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి, లింగపాలెం, చింతలపూడి మండలాలతో పాటు ఇతర డివిజన్‌లలో మామిడి దాదాపు 40 వేల హెక్టార్‌లలో సాగులో ఉంది. నూజివీడు మామిడి రైతు ఏటా నష్టాల బాటలోనే పయనిస్తున్నాడు. దాదాపు రెండు దశాబ్దాలుగా మామిడిని చీడపీడల ఉధృతి వెంటాడుతోంది. ముడ్డిపుచ్చు పురుగు, తుట్టిపురుగుతో పాటు దశాబ్దకాలం మామిడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొగా, రెండేళ్లుగా ఎర్రనల్లి ఉధృతితో తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడి పరిశోధనా కేంద్రానికి ప్రయోగాల నిమిత్తం 200 ఎకరాలు భూమి అవసరమని, అధికార వర్గాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా భూ కేటాయింపు జరగలేదు. మామిడిని పల్వరైజింగ్ చేసే క్రమంలో కార్బైడ్ వాడకాన్ని ప్రభుత్వాలు నిషేధించినా వాటికి ప్రత్యామ్నాయం చూపి పల్వరైజింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడంలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. నూజివీడు కేంద్రంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఎగుమతులకు అవకాశాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి ముంబై, నాగపూర్, అమరావతి (మహారాష్ట్ర), ఢిల్లీ తదితర ప్రాంతాలకు మామిడి ఎగుమతి అవుతుంది. ఐదేళ్ల క్రితం వరకు ఈ ప్రాంతం నుంచి మామిడి ఎగుమతికి రైల్వేశాఖ ప్రత్యేక రాక్‌లను ఏర్పాటు చేసేది. తర్వాత నూజివీడు ప్రాంతం నుంచి రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను నడపకపోవడంతో ఎగుమతులకు రైతులు లారీలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వం నూజివీడు మామిడిపై తీవ్ర నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించింది. అప్పటివరకు అమలైన పంట ప్రోత్సాహకాలను జగన్ ప్రభుత్వం రద్దు చేయడంతో పాటు 2019 వరకు అమలైన వాతావరణ ఆధారిత పంటల బీమా మూలన పడేసింది. మరోవైపు ఉద్యాన పంటలకు అందించే బిందుసేద్యం పరికరాలపై సబ్సిడీ ఎత్తివేయడంతో మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది. జగన్ ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో కొవిడ్ వ్యాప్తి చెందగా, ఉద్యాన రైతులకు ప్రోత్సాహం పేరిట కడప జిల్లా నుంచి అరటి పండ్లను ఇక్కడ మహిళా సంఘాలతో కొనుగోలు చేయించారే తప్ప స్థానిక ఉద్యానవన రైతులకు ఏ ప్రయోజనం చేకూర్చ లేదు. ఎగుమతు లకు లారీలపై ఆధారపడిన రైతులపై రోడ్ ట్యాక్స్ పేరిట పెట్రో ఉత్పత్తులపై రూపాయి ధర పెంచడం తో ఎగుమతి కిరాయి పెరిగి రైతు డీలా పడ్డాడు. దీంతో లాభదాయకంగా లేదని రైతులు మామిడిచెట్లను తొలగించ డంతో నూజివీడు ప్రాంతంలో గ్రీన్‌బెల్ట్ కనుమరుగు అయ్యే పరిస్థితి నెలకొంది.

- నూజివీడు మామిడికి పూర్వవైభవం తీసుకురావాలంటే వాతావరణ ఆధారిత పంటల బీమాను గ్రామం యూనిట్‌గా అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. వీటితో పాటు మరికొన్ని ప్రోత్సాహకాలు అందిస్తే నూజివీడు మామిడికి పూర్వవైభవం సిద్ధిస్తుందని చెబుతున్నారు.
- మామిడి పల్వరైజింగ్‌కు వినియోగించే కార్బైడ్‌ను నిషేధించిన నేపథ్యంలో ప్రతి గ్రామంలో ఈథేన్ గ్యాస్ ఛాంబర్లు (మ్యాంగో పల్వరైజింగ్ యూనిట్) ఏర్పాటు చేయాలి.
- నూజివీడు కేంద్రంగా మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ఢిల్లీ, ముంబై తదితర ప్రాంతాల నుంచి సేట్లను రప్పించి మామిడి ఎగుమతులను ప్రోత్సహించే దిశగా అడుగులు వేయాలి.
- జగన్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించిన బిందు సేద్యానికి సబ్సిడీలు పునరుద్ధరించి, పంట ప్రోత్సాహకాల ద్వారా మామిడికి ప్రోత్సాహం అందించాలి.
- రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తి చేసుకున్న మ్యాంగో ప్రాసెసింగ్ యూనిట్ వ్యాపార సంస్థలకు మినహా, స్థానిక రైతులకు ఉపయోగపడిన సందర్భం లేదు. ప్రత్యేక కమిటీ ద్వారా మ్యాంగో ప్రాసెసింగ్ యూనిట్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చి విదేశీ ఎగుమతులను ప్రోత్సహించాలి.
- ప్రస్తుతం మామిడి రైతును వేధిస్తున్న ఎర్రనల్లి, రాతిమంగు వంటి చీడపీడల నుంచి సరైన సస్యరక్షణ అందే దిశగా చర్యలు చేపట్టాలి.
- మిర్చి, పొగాకు బోర్డులు ఏర్పాటు చేసిన విధంగానే నూజివీడు కేంద్రంగా మామిడి బోర్డును ఏర్పాటు చేయాలి.
- మామిడి పరిశోధనా కేంద్రానికి 200 ఎకరాల భూమిని కేటాయించడంతో పాటు ప్రయోగాలను పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి. ఈ ప్రాంతంలో వేలాది ఎకరాల అటవీ భూమి ఖాళీగా ఉంది. అటవీ శాఖకు చెందిన 200 ఎకరాల్లో మామిడి పరిశోధనకు కేటాయించి, భూ హక్కులను అటవీ శాఖ కిందే ఉంచుకోవచ్చు. ప్రభుత్వానికి భూసేకరణకు అయ్యే ఖర్చు ఆదా అవ్వడమే కాక అటవీ నిబంధనల ప్రకారం ఆ భూమిలో మామిడిచెట్లు (వృక్షాలు) పెంచి, వాటిపై ప్రయోగాలు చేసి రైతులకు వాటి ఫలితాలను అందించవచ్చు.
- రైతులను వేధిస్తున్న ప్రధాన సమస్య నకిలీ పురుగుల మందులు, ఎరువులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి.
- జిల్లా విభజన నేపథ్యంలో నూజివీడు కేంద్రంగా ఉన్న ఉద్యానవన శాఖ సహాయసంచాలకుల కార్యాలయం ఏలూరుకు తరలిపోయింది. నూజివీడు కేంద్రంగా ఈ కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించాలి.
- జగన్ ప్రభుత్వం రద్దు చేసిన బిందుసేద్యం సబ్సిడీలను, పంట ప్రోత్సాహకాలను తిరిగి ప్రవేశపెట్టి నూతనంగా మామిడి తోటలను వేసేందుకు రైతులను ప్రోత్సహించాలి.

నగరాభివృద్ధికి కృషి చేస్తాం..

- నూతన ప్రభుత్వంతో కలిసి నడుస్తాం..
- నగర మేయర్ షేక్ నూర్జహాన్
- నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం




సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు.. మేయర్ నూర్జహాన్

ఏలూరు టూటౌన్, జూన్ 3 : నగరాభివృద్ధికి కృషి చేస్తామని నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం జరిగింది. మేయర్ మాట్లాడుతూ నగరంలో రోడ్లు, డ్రెయిన్లు, పార్కులు, శ్మశాన వాటికల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఏడు విలీన గ్రామాలకు గోదావరి కాల్వ నుంచి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి నగరాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం 11 అంశాలతో కూడిన ఏజెండాను ప్రవేశపెట్టారు. ఈ అంశాలన్నింటికి ఏకగ్రీవంగా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఇదిలా ఉండగా ఎన్నడు లేని విధంగా కౌన్సిల్ చరిత్రలో ఎటువంటి అభ్యంతరాలు లేకుండా సమావేశం సాదా సీదాగా జరిగింది. అధికార, ప్రతిపక్షానికి చెందిన సభ్యులు ఒకరిని ఒకరు తిట్టుకోవడం సవాళ్ళు ప్రతి సవాళ్ళు లేకుండా ప్రశాంతంగా సాగింది. కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు మాట్లాడుతూ కౌన్సిల్‌లోని 50 మంది సభ్యులు పార్టీలకు అతీతంగా నగరాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామన్నారు. గతంలో మేము వైసీపీ నుంచి గెలుపొందామని, అయినప్పటికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంతో కలిసి పని చేస్తామన్నారు. వైసీపీ, టీడీపీ పార్టీల పేర్లు లేకుండా అందరూ కలిసికట్టుగా ప్రజల ఆకాంక్షల మేరకు పని చేస్తామన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటితో ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చామన్నారు. ఎమ్మెల్యే చంటి పార్టీలకతీతంగా కలిసి పని చేసి నగరాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారన్నారు. కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ జూలై 1వ తేదీన వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పింఛన్లను ఒక రోజులోనే 100 శాతం పూర్తి చేయడం రికార్డన్నారు. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు ఇంటింటికి వెళ్ళి పింఛన్లు అందించడం దేశ చరిత్రలో ప్రథమమన్నారు. ఇది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వానికి సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, డిప్యూటీ మేయర్లు గుడిదేసి శ్రీనివాసరావు, లోకపేయి సుధీర్‌బాబు, మున్సిపల్ ఇంజనీర్ కొండలరావు, ఏసీపీ తిరుపతిరావు, ఆర్వోలు శోభా, అరుణ, ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎజెండా అంశాలు..

- జూన్ 3వ తేదీ 2024వ సంవత్సరం నాటి సర్వసభ్య సమావేశం అజెండాలో 20 అంశాలను ధ్రువీకరణ.
- తాగునీటి కోసం వినియోగించే హెడ్ వాటర్ వర్క్స్, రావాటర్ పంపింగ్ స్టేషన్ల మరమ్మతుల నిర్వహణ కోసం రూ.45,58,000 అంచనా.
- తాగునీటి వినియోగం కోసం బోర్ల మరమ్మతుల కోసం రూ.35లక్షల అంచనాలు
- వీధి దీపాల నిర్వహణ కోసం రూ.28,47,000 అంచనా.
- పాఠశాలల్లో స్వీపర్ల జీతాల కోసం, ఈ ఏడాదికి 56 మందికి నెలకు రూ.4వేలు చెల్లించడం
- కౌన్సిల్ హాలును కౌన్సిల్ సమావేశాలకే వినియోగం
- మెప్మా కార్యాలయాన్ని వేరే చోటకు తరలించడం
- వేర్వేరు సచివాలయాలకు అద్దె చెల్లింపుల కోసం..
- పెట్రోల్ పంపును నగరపాలక సంస్థ సొంతంగా నిర్వహించేందుకు అనుమతి కోసం
- వ్యవసాయ భూమిని నివాసయోగ్యానికి వినియోగించుకునేందుకు అనుమతి

చీపురుగూడెం దళితవాడలో ప్రబలిన జ్వరాలు


చీపురుగూడెంలో జ్వరాలపై ఇంటింటి సర్వే.. వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

చాట్రాయి, జూలై 3: మండలంలోని చీపురుగూడెం దళితవాడలో సీజనల్ జ్వరాలు ప్రబలడంతో వైద్య ఆరోగ్యశాఖ నివారణ చర్యలు చేపట్టింది. ఇక్కడ నుంచి కొన్ని రోజులుగా జ్వరపీడితులు చింతలపూడి ప్రభుత్వాస్పత్రికి వెళ్ళి చికిత్స పొందుతున్నారు. వర్షాలకు నివాస ప్రాంతాల్లో నీరు నిలిచి పారిశుధ్యం అధ్వానంగా మారిందని, రోడ్ల పక్కన చెత్త కుప్పలు ఉండడం వల్ల దోమలు ఈగలు పెరిగి జ్వరాలు విజృంభించాయని స్థానికులు చెబుతున్నారు. స్థానిక టీడీపీ నాయకుడు బొట్టు లక్ష్మణరావు సమస్యను ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు బుధవారం గ్రామంలో వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి, జ్వర పీడితులకు వైద్యాధికారులు శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాద్, జ్యోతి చికిత్స అందించారు. పారా మెడికల్ టీం ఇంటింటి సర్వే నిర్వహించి ఏడుగురు జ్వరాలతో ఉన్నవారిని, 9 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. తాగునీటి శాంపిల్స్‌ను, జ్వర పీడితుల రక్త నమూనాలను పరీక్షల నిమిత్తం ఏలూరు ల్యాబ్‌కు పంపినట్టు వైద్యాధికారులు చెప్పారు. జిల్లా డిసీజ్ సర్వేలెన్స్ అధికారి నరేంద్రకృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో లక్ష్మీనారాయణ, డీపీహెచ్‌వో విజయలక్ష్మి గ్రామంలో పర్యటించి పరిస్థితి సమీక్షించారు. రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించి అక్కడ పైప్‌లైన్ వాల్ లీకేజి గుర్తించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి తెలపగా వెంటనే మరమ్మతులు చేశారు. ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీరు తాగాలని, మంసాహారం తినవద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వాడాలని జ్వర లక్షణాలు కన్పిస్తే వెంటనే వైద్య శిబిరానికి వచ్చి చికిత్స తీసుకోవాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నేడు చీపురుగూడెంకు మంత్రి పార్థసారథి

చీపురుగూడెం దళితవాడలో జ్వరాలు ప్రబలడంతో, నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గురువారం ఉదయం గ్రామాన్ని సందర్శిస్తారని మండల టీడీపీ నాయకుడు బొట్టు లక్ష్మణరావు తెలిపారు.

డి. ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.3127, రాజమండ్రి

ఎన్నికల మహాజన సభ నోటీసు

(ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల నియమావళి 1964లోని నియమము-22(3)(ఎ) ప్రకారము)

డి.ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నెం.3127, రాజమండ్రి యొక్క నూతన పాలకవర్గ సభ్యుల ఎన్నిక జరపవలసియున్నది. ఈ ఎన్నికల ప్రక్రియ కొరకు తేది.20-7-2024 శనివారం ఉదయం 8 గం॥ నుండి సాయంత్రం 4గం॥ల వరకు లోకల్ నియోజకవర్గమునకు సంబంధించిన బ్రాంచిలు అనగా 1. మెయిన్ బ్రాంచ్ 2. ఫోర్ట్ గేట్ 3. తాడితోట 4. కాతేరు 5. స్వరాజ్యనగర్ 6. జె.ఎన్.రోడ్ 7. బొమ్మూరు 8. దానవాయిపేట లకు సంబంధించి ఎన్నిక మహాజన సభ ఎస్.కె.వి.టి ఇంగ్లీషు మీడియం హైస్కూల్, దానవాయిపేట, రాజమహేంద్రవరం మరియు అదే ఆవరణంలో వున్న ఎస్.కె.వి.టి. డిగ్రీ కళాశాల (వై.జంక్షన్) రాజమహేంద్రవరం నందు జరుపుటకు మరియు నాన్‌లోకల్ నియోజకవర్గములకు సంబంధించిన బ్రాంచిలు అనగా 1. కాకినాడ 2. తాడేపల్లిగూడెం, 3. తణుకు 4. దివాన్‌చెరువు 5. భీమవరం 6. అమలాపురం 7. సీతమ్మధార (వైజాగ్) 8. గుంటూరులకు సదరు బ్రాంచ్ ఆవరణలో ఎన్నికల మహాజన సభ జరుపుటకు నిర్ణయించడమైనది. కావున ఓటు హక్కు కలిగిన యావన్మంది సభ్యులు తమ పాలకవర్గ సభ్యులను ఎన్నుకొను నిమిత్తం ఎన్నికల మహాజన సభకు హాజరు కావలసినదిగా కోరడమైనది. సదరు ఎన్నికల మహాజన సభకు హాజరగు సభ్యులు బ్యాంకు వారిచే ఇవ్వబడిన తమ ఫొటో గుర్తింపు కార్డుతో హాజరు కావలసినదిగా కోరడమైనది.

సం/- వి. కృష్ణకాంత్, డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్, కొవ్వూరు మరియు ఎన్నికల అధికారి
డి.ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.3127, రాజమండ్రి
రాజమహేంద్రవరం, తేది.4-7-2024

ఎన్నికల ప్రకటన

ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.3127, రాజమండ్రి

ఫారము-1

తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం అర్బన్ మండలంలోని డి.ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.3127, రాజమండ్రి యొక్క పాలకవర్గమునకు ది.20-07-2024 తేదీ శనివారం ఎన్నికలు నిర్వహించుటకు జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అథారిటీ రాజమహేంద్రవరం వారు నన్ను ఎన్నికల అధికారిగా నియమించినారు.

ఎన్నికల కార్యక్రమము ఈ క్రింది విధంగా ఉంటుంది.

1) బ్యాంకు పేరు, రిజిస్టర్డ్ నెం : డి. ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.3127, రాజమండ్రి
2) ఎన్నికల విధానం : రహస్య బ్యాలెట్
3) మొత్తము ఎన్నికల జరుగు స్థానములు మరియు ఎస్.సి/ ఎస్.టి./వెనుకబడిన తరగతులు/ మరియు స్త్రీలు/ ఇతరులకు కేటాయింపు ఏమైనా ఉన్నచో : 12 (పన్నెండు) ఎట్టి రిజర్వేషన్లు లేవు
4) నియోజకవర్గములు సంఖ్య : 3

బ్రాంచి పేర్లు	ఓటర్ల జాబిత క్రమ సంఖ్య నుండి	వరకు	ఎన్నికలు జరుగు స్థానములు
నియోజకవర్గము-1 (లోకల్)			
1. మెయిన్ బ్రాంచ్	1	41923	
2. ఫోర్ట్ గేట్	41924	49555	
3 తాడితోట	49556	55875	10
4. కాతేరు	55876	61050	(పది)
5. స్వరాజ్యనగర్	61051	64137	
6. జె.ఎన్.రోడ్	64138	70352	
7. బొమ్మూరు	70353	70436	
8. దానవాయిపేట	70437	70519	
నియోజకవర్గము- 2 (నాన్ లోకల్)			
1 కాకినాడ	70520	72606	
2. తాడేపల్లిగూడెం	72607	74102	1
3. తణుకు	74103	74357	(ఒకటి)
నియోజకవర్గము-3 (నాన్ లోకల్)			
1. దివాన్‌చెరువు	74358	76972	
2. భీమవరం	76973	77416	1
3. అమలాపురం	77417	78023	(ఒకటి)
4. సీతమ్మధార (వైజాగ్)	78024	78328	
5. గుంటూరు	78329	78423	

5. పోలింగ్ జరుగు తేది సమయం మరియు ప్రదేశము (పోటీ అనివార్యమైనపుడు) : ది.20-07-2024 శనివారం ఉదయం 8గం॥ల నుండి సాయంత్రం 4 గం॥ల వరకు

బ్రాంచి పేర్లు	ఎన్నికల జరుగు స్థలము
నియోజకవర్గము-1 (లోకల్)	
1. మెయిన్ బ్రాంచ్ 2. ఫోర్ట్ గేట్ 3. తాడితోట 4. కాతేరు 5. స్వరాజ్యనగర్ 6. జె.ఎన్.రోడ్ 7.బొమ్మూరు 8. దానవాయిపేట	ఎస్.కె.వి.టి. ఇంగ్లీషు మీడియం హైస్కూల్, దానవాయిపేట రాజమండ్రి మరియు అదే ఆవరణలో ఉన్న ఎస్.కె.వి.టి. డిగ్రీ కళాశాల (వై.జంక్షన్) రాజమహేంద్రవరం
నియోజకవర్గము -2 (నాన్ లోకల్)	
1. కాకినాడ	డోరునెం.10-5-52, నాగేశ్వరరావు వీధి, రామారావు పేట, కాకినాడ, కాకినాడ జిల్లా
2. తాడేపల్లిగూడెం	ఎన్.టి.ఆర్.సెంటర్, మెయిన్‌రోడ్, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా
3. తణుకు	డో.నెం.20-7-2/1, వార్డ్ నెం.21, వల్లూరి వారి వీధి, గవర్నమెంట్ బోయ్స్ హైస్కూల్ ఎదురుగా, తణుకు,ప.గో.జిల్లా
నియోజకవర్గము -3 (నాన్ లోకల్)	
1. దివాన్‌చెరువు	డోర్.నెం.1-123, దివాన్‌చెరవు, రాజమహేంద్రవరం రూరల్, తూ.గో.జిల్లా
2. భీమవరం	డోర్‌నెం.22-10-39, తటపర్తి వారి వీధి, తాలుకా ఆఫీస్ దగ్గర, భీమవరం, ప.గో.జిల్లా
3. అమలాపురం	డోర్ నెం.3-2-16, బ్యాంకు వీధి, కూచిమంచి అగ్రహారం, అమలాపురం, డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా
4. సీతమ్మధార(వైజాగ్)	డో.నెం.50-40-1/1, పి & టి కాలనీ, సీతమ్మధార, విశాఖపట్టణం, విశాఖజిల్లా.
5. గుంటూరు	డో.నెం.6-31-26, 10/4వ లైన్, టొంకరోడ్, లాగూర్ విగ్రహం వద్ద, అరండాల్‌పేట, గుంటూరు, గుంటూరు జిల్లా.

6. నామినేషన్లు స్వీకరణ తేది, సమయం ప్రదేశము (షె.కులము రూ 200/-, షె తగలు రూ.200/- వెనుకబడిన తరగతులు రూ. 400/- ఇతరులు రూ 1000/- నామినేషన్ రుసుముగా చెల్లించాలి) : ది.11-07-2024 గురువారం ఉ.11గం.ల నుండి సా.5 గం.ల వరకు బ్యాంక్ ప్రధాన కార్యాలయం ది ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్, రాజమహేంద్రవరం, గోకవరం బస్టాండ్ వద్ద
7. నామినేషన్ల పరిశీలన తేది సమయము మరియు ప్రదేశము : ది.12-7-2024 శుక్రవారం ఉ.11గం.ల నుండి ప్రధాన కార్యాలయం, డి.ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్, రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ వద్ద.
8. నామినేషన్ల ఉపసంహారణ తేది సమయము మరియు ప్రదేశము : ది.13-7-2024 శనివారం ఉ.11 గం.ల నుండి సా.5 గం. వరకు ప్రధాన కార్యాలయం, ది ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్, రాజమహేంద్రవరం, గోకవరం బస్టాండ్ వద్ద
9. ఓట్లు లెక్కింపు జరుగు తేది సమయము మరియు ప్రదేశము : ది.21-7-2024 ఆదివారం ఉ.8 గం.ల నుండి ఎస్.కె.వి.టి.ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, దానవాయిపేట, రాజమహేంద్రవరం మరియు ఇదే ఆవరణలో ఉన్న ఎస్.కె.వి.టి.డిగ్రీ కళాశా (వై.జంక్షన్) రాజమహేంద్రవరం)
10. ఎన్నికల ఫలితములను ప్రకటించు తేదీ, సమయము మరియు ప్రదేశము : ది.21-7-2024 ఆదివారం కౌంటింగ్ పూర్తయిన పిదప, ఎస్.కె.వి.టి.ఇంగ్లీషు మీడియం హైస్కూల్, దానవాయిపేట, రాజమహేంద్రవరం మరియు అదే ఆవరణలో ఉన్న ఎస్.కె.వి.టి. డిగ్రీ (వై.జంక్షన్) కళాశాల రాజమహేంద్రవరం
11. ఆఫీస్ బేరర్ల ఎన్నిక, పాలక మండలిలో భర్తీ కాని స్థానములను మరియు ఖాళీలగు స్థానములను కో-ఆప్షన్ ద్వారా భర్తీ చేయుట : ది.22-7-2024 సోమవరం ఉ.8గం.ల నుండి ప్రధాన కార్యాలయం, దిఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన బ్యాంక్, రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ వద్ద

గమనిక: బ్యాంక్ సభ్యులు బ్యాంకు యొక్క బ్రాంచిల నందు గల నోటీసు బోర్డులో ఉంచబడిన ఓటింగ్‌కు అర్హత గల సభ్యుల జాబితాను పరిశీలించు కోవచ్చును.

సం/- వి.కృష్ణకాంత్
డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్,
కొవ్వూరు మరియు ఎన్నికల అధికారి
డి.ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నెం.3127, రాజమండ్రి
రాజమహేంద్రవరం
తేది. 4-7-2024

నేటి నుంచి ఏపీ ఈఏపీసెట్ సర్టిఫికెట్ల పరిశీలన



7వరకూ కొనసాగనున్న ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

8 నుంచి 12 వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు

జేఎన్టీయూకే, జూలై 3: ఏపీ ఈఏపీసెట్- 2024 అడ్మిషన్లకు ఎంపీసీ విభాగం అభ్యర్థులకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఈనెల 4 నుంచి జరుగనుంది. ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభ మైంది. దీని ద్వారా ఇంజనీరింగ్ కళాశాలల్లోని సీట్లను భర్తీ చేయనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఏపీ ఈఏపీసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ ఆదివారం జారీచేశారు. ఈనెల 7వరకూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపుచేసుకోవచ్చని కాకినాడ జేఎన్టీయూకేలోని యూసీఈకే సహాయ కేంద్రం సమన్వయకర్త ప్రొఫెసర్ ఎస్.బాలాజీ తెలిపారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇలా

అభ్యర్థులు మొదటిగా https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి అడ్మిషన్లపై క్లిక్ చేయాలి అనంతరం వచ్చిన ఫారంలో హాల్ టికెట్ నెంబరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే రిజిస్ట్రేషన్ ఫారం వస్తుంది. అందులో అడిగిన సమాచారం క్షుణ్ణంగా నింపి సబ్‌మిట్ చేయాలి. అనంతరం పది, ఇంటర్ మార్కుల జాబితాలు, 6 నుంచి ఇంటర్ వరకూ స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ర్యాంకు కార్డు, రేషన్ కార్డు, హాల్ టికెట్లను అప్‌లోడ్ చేయాలి. ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం ఉన్న వారికి 2022 నుంచి 10 శాతం రిజర్వేషన్‌ను ప్రతీ ఏడాది అమలు చేస్తున్నారు.

షెడ్యూల్ ఇదే

ఈ నెల 7 వరకూ ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్
4 నుంచి 10 వరకూ ధ్రువపత్రాల పరిశీలన
8 నుంచి 12 వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు
13న ఆప్షన్ల మార్పు, 16న సీట్ల కేటాయింపు
17 నుంచి 22 వరకూ కళాశాలల్లో రిపోర్టింగ్
19 నుంచి తరగతుల ప్రారంభం

ఇవి సిద్ధం చేసుకోండి

ర్యాంకు కార్డు, మార్కుల జాబితా, హాల్ టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్, నివాస, కులధ్రువీకరణ, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలను విద్యార్థులు సిద్ధం చేసుకోవాలి. పీహెచ్, క్యాప్, ఎన్‌సీసీ, స్కౌట్స్, గైడ్స్, స్పోర్ట్స్, గేమ్స్, ఆంగ్లో ఇండియన్ కేటగిరీ అభ్యర్థులకు మాత్రం ఈనెల 6 నుంచి విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నారు.

ట్రిపుల్ ఐటీలో ప్రత్యేక కేటగిరీలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నూజివీడు టౌన్,జూలై 3: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు మూడోరోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ర్వహించారు. ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సైనిక సంతతి విభాగానికి చెందిన 57 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 49,ఎన్‌సీసీ విభాగంలో 101 మంది, క్రీడా విభాగంలో 180, దివ్యాంగుల విభాగంలో 248 మంది మొత్తం 579 విద్యార్థులు వెరిఫికేషన్‌లో పాల్గొన్నారు.

డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్లకు డీఎన్నార్‌లో హెల్ప్ సెంటర్

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 3: 2024-25 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ పద్ధతిలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు సహకరించేందుకు హెల్ప్‌లైన్ సెంటర్ డీఎన్నార్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు నరసింహరాజు ప్రారంభించారు. బీఏ, బీకాం, బీఎస్సీలలో ప్రవేశం కోరే విద్యార్థులు డీఎన్నార్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్‌కు వచ్చి తమ పేర్లను ఈనెల 10వ తేదీలోగా రిజిస్టరు చేయించుకోవాలని ఆ తరువాత 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ తాము కోరుకున్న కోర్సులకు వెబ్ ఆప్షన్‌లు పెట్టుకోవాలని, వారికి సీట్లు కేటాయింపు ఈనెల 19వ తేదీన జరుగుతుందని తెలియజేశారు.



కల్కి కారులో ఆర్ఆర్ఆర్

ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ సినిమాలో వినియోగించిన కారు భీమవరంలోని మల్టీప్లెక్స్ థియేటర్ ఆవరణలో సందడి చేస్తోంది. మంగళవారం రాత్రి ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు ఈ బుజ్జి కారులోకి ఎమ్మెల్యే ఎక్కి సందడి చేశారు అభిమానులు, నాయకులు ఎమ్మెల్యేతో కారు వద్ద సెల్ఫీలు దిగారు. -ఉండి



ఆడిట్ ఉద్యోగుల నూతన కార్యవర్గం

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

ఏలూరు రూరల్, జూలై 3: ఉద్యోగుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ అన్నారు. ఏలూరు కలెక్టరేట్ ఆవరణల ఏపీ ఎన్జీవో స్టేట్ ఆడిట్ అసోసియేషన్ ఏలూరు జిల్లాశాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డీఎస్ఎస్ గణేష్, ప్రధాన కార్యదర్శిగా బి.లక్ష్మిపతి, ఉపాధ్యక్షుడిగా వై.జయప్రకాష్, శరత్‌బాబు, ఎమ్డీ ఖాజావలీ, కోశాధికారిగా వై.సీతారామ్, సంయుక్త కార్యదర్శులుగా ఎన్.శ్రీనివాస్, శ్రీనివాస్ ఎన్నిక య్యారు. సహాయ ఆడిట్ అధికారిగా జ్యోతి, సీనియర్ ఆడిటర్‌గా పి.రాజేంద్ర ఎన్నికయ్యారు. ఏపీఎన్జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి నెరుసు రామారావు మాట్లాడుతూ ఆడిట్ ఉద్యోగులకు అన్ని విధాలుగా ఏపీ ఎన్జీవో అండగా ఉంటుందన్నారు. నూతన అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ ఆడిట్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బలమైన నాయకత్వం అవసరమన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించారు. జోన్-2 ఉప సంచాలకులు చినపరెడ్డిని కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జూలై 3 : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పుర స్కారం-2024లకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల టీచర్ల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 15లోగా చేసుకోవాలని, తదుపరి జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా రాష్ట్రస్థాయి సెలక్షన్ కమిటీకి ఈ నెల 25లోగా పంపించాలని కోరారు. స్టేట్ సెలక్షన్ కమిటీ ద్వారా షార్ట్ లిస్టు చేసిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆగస్టు నాలుగో తేదీలోగా ఇండిపెండెంట్ నేషనల్ జ్యూరీకి పంపిస్తామన్నారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ షార్ట్ లిస్టు చేసిన ఉపాధ్యాయుల వివరాలను ఆగస్టు 5,6 తేదీల్లో వెబ్‌సైట్‌లో పొందుపరుస్తుందని వివరించారు. వ్యక్తిగత ముఖాముఖీలను వీడియో కాన్ఫరెన్స్ లేదా వ్యక్తి గతంగా ఆగస్టు 7 నుంచి 12 వరకు జ్యూరీ నిర్వహిస్తుందన్నారు. పురస్కారాలకు ఎంపికైన టీచర్ల వివరాలను ఆగస్టు 13న వెబ్‌సైట్‌లో ఉంచుతారన్నారు.

మొగల్తూరులో మైనింగ్ అధికారుల తనిఖీలు



మొగల్తూరు, జూలై 3: మొగల్తూరు పంచాయతీ పరిధిలో ఇసుక తవ్వకాలు, అక్రమ లేఅవుట్‌లను బుధవారం జిల్లా మైనింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మైనింగ్ శాఖ టీఏ బాబూరావు, సిబ్బంది, వీఆర్వో సుబాషిణిలు ఇటీవల వేసిన లేఅవుట్‌లు, స్థలాల పూడికలను పరిశీలించారు. మైనింగ్ శాఖ అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు చేసి స్థలాలు పూడికలు చేశారని భారీ లోతున ఇసుక తవ్వారని వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. లేఅవుట్‌లు వేసిన భూ యజమానులకు నోటీసులు ఇవ్వనున్నట్టు అధికారులు తెలిపారు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

పోలవరం జూలై 3 : పోలవరంలో గోదావరి నీటిమట్టం పెరుగుతూ వస్తుంది బుధవారం ఉదయం నాటికి నీటిమట్టం పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు, కొండవాగుల నీటి జలాలతో ఉపనదుల జలాలతో నీటిమట్టం పెరుగుతూ వస్తుంది. స్పిల్వే ఎగువన 26.470 మీటర్లు, స్పిల్వే దిగువన 16.530 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 26.520 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాంకి దిగువన 15.360 మీటర్ల నీటిమట్టం నమోదైనట్టు ఈఈ వెంకటరమణ తెలిపారు. గండి పోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద నీటిమట్టం రెండు అడుగులు మేర పెరిగింది.

పోలవరం ఏజెన్సీలో చిరుత సంచారం



మృతి చెందిన మేకను పరిశీలిస్తున్న అధికారులు

పోలవరం జూలై 3 : పోలవరం ఏజెన్సీలో చిరుత సంచారం,మేకలపై దాడితో గిరిజనులు భయపడుతున్నారు. పోలవరం మండలం వింజరం పంచాయతీ సున్నాలగండి గ్రామ సమీపంలో మడకం పుల్లారావుకు చెందిన మేకపై మంగళవారం రాత్రి చిరుత దాడి చేసి చంపినట్టు అటవీ క్షేత్రాధికారి దావీదురాజు తెలిపారు. బాధితుడు పుల్లారావు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా ప్రాంతానికి వెళ్ళి పశు వైద్యాధికారితో పరిక్షలు నిర్వహించి ఆ ప్రాంతంలో చిరుత పాదముద్రలు సేకరించామన్నారు. సమీప గ్రామాల్లో చిరుత సంచారంపై అటవీశాఖ సిబ్బందితో అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఒంటరిగా అడవుల్లోకి వెళ్ళరాదని పశువులను అడ వుల్లో మేపరాదని, పంట పొలాల్లో వంగి పనులు చేసేటప్పుడు మరొకరు పరిస రాలు గమనిస్తూ ఉండాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైర్ల చోరీ



జీలుగుమిల్లి, జూలై 3 : జీలుగుమిల్లి సమీప గ్రామాల్లో రైతుల పొలాల్లో వ్యవ సాయ బోర్ల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైర్లను చోరీ చేస్తున్నారు. మంగళవారం రాత్రి రైతు రేపాక రాజేష్ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైర్లు చోరీ చేశారు. పది రోజుల్లో ఇది నాల్గో చోరీగా రైతులు చెబుతున్నారు. కొద్ది రోజుల క్రితం బర్రింకలపాడు, గత ఆదివారం దర్భగూడెం, పి.రాజావరంలో ఇదే క్రమంలో వరుస చోరీలకు పాల్పడ్డారు.మంగళవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగలు రైతులకు పోలీస్‌లకు సవాలు విసురుతున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చొరవ చూపడం లేదంటున్నారు.దీంతో రాత్రి వేళ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగల ఆగడాలు హెచ్చు మీరుతున్నాయి. విద్యుత్ సిబ్బంది మాత్రం ఎవరిమీదైనా అనుమానం ఉంటే తెలియజేయాలని రైతుల్ని కోరారు.

అమెజాన్ ఆర్డరే పట్టించింది..!

ఎనిమిది నెలల క్రితం యువతి అదృశ్యం కేసు

యువతిని తీసుకెళ్లిన వ్యక్తి కోసం గాలింపు

జమ్మూకశ్మీర్‌లో ఆన్‌లైన్ ఆర్డర్..ట్రాక్ చేసి పట్టుకున్నారు

జంగారెడ్డిగూడెంలో తల్లికి అప్పగించిన పోలీసులు

విజయవాడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఎనిమిది నెలల కిందట అదృశ్యమైన యువతిని ఓ అమెజాన్ ఆన్‌లైన్ ఆర్డర్ పట్టించింది. ఒక యువకుడితో జమ్మూకశ్మీర్‌లో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు ఆమెను మంగళవారం అర్ధరాత్రి విజయవాడకు తీసుకొచ్చారు. మాచవరం పోలీసులు బుధవారం ఆ యువతిని పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన తల్లికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడలో హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్న తన కుమార్తె కనిపించడం లేదని తల్లి గతంలో మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా స్పందించడంతో దర్యాప్తులో వేగం పెంచారు.

దక్షిణాది టు ఉత్తరాది..

గత నవంబరులో అంజాద్ అలియాస్ షణ్ను అనే యువకుడు ఆ యువతిని తీసుకుని వెళ్లిపోయాడు. తొలుత పోలీసులు హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించినా ఫలితం లేకపోయింది.పోలీసులు ట్రాక్ చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న అంజాద్ తనతో పాటు యువతి ఫోన్‌ను అమ్మేశాడు. అక్కడ మిస్సయిన ఈ ఇద్దరూ కలిసి దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాలను చుట్టుముట్టేశారు. హైదరాబాద్ నుంచి రైల్లో బెంగళూరు వెళ్లారు. అక్కడి నుంచి కేరళకు చేరుకున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్ వెళ్లారు. బెంగళూరులో స్నేహితుల వద్ద వారం పాటు ఉన్నారు. అక్కడి నుంచి కేరళ వెళ్లి తర్వాత రాజస్థాన్‌కు వెళ్లారు. అక్కడి నుంచి జమ్మూకశ్మీర్‌కు వెళ్లారు. ఈ ప్రయాణాలన్నీ రైల్లోనే చేశారు. ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లినా టికెట్ కొనకుండా జనరల్ బోగీల్లో ప్రయాణించారు. జమ్మూకశ్మీర్ వెళ్లాక అంజాద్ అక్కడ సెకండ్ హ్యాండ్ ఫోన్ కొన్నాడు. అందులో సిమ్‌కార్డు వేసి బెంగళూరులో ఉన్న స్నేహితులతో మాట్లాడటం మొదలుపెట్టాడు.ఈ వివరాలను గుర్తించిన పోలీసులు బెంగళూరుకు వెళ్లి వారిని విచారణ చేయగా, అక్కడికి వచ్చి వెళ్లిపోయారని తెలుసుకున్నారు.అంజాద్ తన ఆధార్‌కార్డు నెంబర్‌ను ఉపయోగించి అమెజాన్‌లో ఆన్‌లైన్ ఆర్డర్ ఇచ్చాడు. దీన్ని సైబర్ క్రైం పోలీసులు ట్రాక్ చేశారు. ఈ లొకేషన్‌ను అక్కడి పోలీసులకు షేర్ చేసి అసలు విషయాన్ని వివరించారు. జమ్మూకశ్మీర్ పోలీసులు అంజాద్‌తో పాటు యువతిని అదుపులోకి తీసుకున్నారు.అక్కడి నుంచి మాచవరం పోలీసులు యువతిని తీసుకువచ్చి క్షేమంగా తల్లి చెంతకు చేర్చారు. అంజాద్‌పై ఆమె తల్లి మరో ఫిర్యాదు చేయనుంది. ప్రస్తుతం అంజాద్ పోలీసుల అదుపులో ఉన్నాడు.

పింఛన్ సొమ్ము పక్కదారి

రికవరీ చేసి లబ్ధిదారులకు అందించిన అధికారులు

ద్వారకా తిరుమల, జూలై 3: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్ము స్వాహా చేసినట్టు ఆరోపణలు రావడంతో విచారణకు వచ్చిన అధికారులకు బంగారం తాకట్టు పెట్టి ఆ సొమ్ము ఇచ్చిన ఘటన మండలంలోని పంగిడిగూడెంలో చోటు చేసుకుంది. పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తానని చెప్పి వీఆర్వో చంద్రలీల పూర్తిస్థాయిలో ఇవ్వలేదని లబ్ధిదారులు లబోదిబోమనడంతో అధికారులు రంగంలోకి దిగారు. ఎంపీడీవో తిరుపతిరావు, డిప్యూటీ తహసీల్దారు దుర్గామహాలక్ష్మిలు వెళ్లి సొమ్ము రికవరీ చేసి మిగిలిన 13 మందికి పింఛన్లను అందజేశారు. పంగిడిగూడెంలో 56 మంది లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేసేందుకు వీఆర్వో చంద్రలీల సొమ్ము తీసుకున్నారు. తొలిరోజున 39 మందికి ఆమె పింఛన్ అందించారు. మరుసటి రోజు మరో నలుగురికి అందించారు. మిగిలిన 13 మంది తమకు పింఛను అందలేదని అధికారులకు చెప్పడంతో డీటీ దుర్గామహలక్ష్మి పంగిడిగూడెం వెళ్లి వీఆర్వో, లబ్ధిదారులతో మాట్లాడారు. తనవద్ద ప్రస్తుతం డబ్బులేదని బుధవారం అందిస్తానని చెప్పగా కుదరదని లబ్ధిదారులకు ఇవ్వాలని డీటీ చెప్పడంతో వీఆర్వో సహాయకుడిగా పని చేస్తున్న వెంకటేశ్వర రావు బంగారం తాకట్టు పెట్టి రూ.91 వేలు సొమ్ము అధికారులకు ఇచ్చారు. దానిని 13 మంది లబ్ధిదారులకు అందించారు. దీనిపై ఎంపీడీవో తిరుపతిరావు మాట్లాడుతూ వీఆర్వోకు ఫోన్ చేయగా తాను ఆసుపత్రిలో ఉన్నానని ఆరోగ్యం బాగోక పోవడంతో మరుసటి రోజు పంపిణీ చేద్దామని అను కున్నానని చెప్పారన్నారు. ఈ విషయం డీటీతో చెప్పగా ఆ మధ్యాహ్నం ఆమె వెళ్లి మొత్తం సొమ్ము రికవరీ చేసి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారన్నారు.

వందేభారత్‌కు ఏలూరులో హాల్ట్ ఇవ్వాలి



రైల్వేబోర్డు చైర్మన్ జయవర్మ సిన్హాను కలిసిన ఎంపీ మహేష్

ఏలూరు టూటౌన్, జూన్ 3: వందే భారత్ ట్రైన్‌కు ఏలూరు స్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని రైల్వే బోర్డు చైర్మన్, సీఈవో జయవర్మ సిన్హాను బుధవారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ ఢిల్లీలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రజల చిరకాల స్వప్నమైన భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్ మంజూరు చేయాలని కోరానన్నారు. సానుకూలంగా స్పందించిన జయవర్మ సిన్హా త్వరలోనే పనులు పూర్తయేలా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే జిల్లాలోని టొబాకో రైతులు ఎదుర్కుంటున్న సమస్యలు పరిష్కరించాలని మినిస్ట్రీస్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ సునీల్ వర్త్వల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. వర్జీనియా పొగాకును ఇతర దేశాలకు అదనంగా ఎగుమతి చేసుకునేందుకు రైతులకు అవకాశం ఇవ్వాలన్నారు.

క్రైం కార్నర్


రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పోలవరం, జూలై 3 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలపాలైన సంఘటన పోలవరం మండలం ప్రగడపల్లి పంచాయతీ శివారున బుధవారం మధ్యాహ్నం జరిగింది. పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వింజరం పంచాయతీ వెంటకరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కారం సురేష్ దొర (28),కొమరం రాంప్రసాద్ దొండపూడి వైపు వెళ్తూ ఎదురుగా వస్తున్న ప్రైవేటు స్కూలు బస్సుని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలవడంతో అదే బస్సులో పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సురేష్‌దొర మృతి చెందాడు. మరొక యువకుడు రాంప్రసాద్ చికిత్స పొందుతున్నాడు. కేసుని గోపాలపురం పోలీస్ స్టేషన్‌కి బదలాయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

తణుకు, జూలై 3 : ఉండ్రాజవరం మండలం కాల్దరి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందాడు. తణుకు రైల్వే అవుట్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. మృతుడు నిడదవోలు నుంచి వేంద్ర వరకు టికెట్ తీసుకున్నాడని, సుమారు అరవై సంవత్సరాల వయసు ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో ఎస్ఐ మృతి



భీమవరం క్రైం, జూలై 3: రాత్రిపూట గస్తీ తిరిగి తెల్లవారుజామున ఇంటికి వెళ్లిన ఎస్ఐ గుండెపోటుతో మృతి చెందారు. ప్రభుత్వాసుపత్రి సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన నాగేశ్వరరావు (61) ఎన్నికల ముందు విజయవాడ నుంచి భీమవరం ఎస్ఐగా బదిలీపై వచ్చారు. అయితే మంగళవారం రాత్రి గస్తీ తిరిగి తెల్లవారుజామున తన సొంత కారులో ఇంటికి వెళ్లారు. తను ఉంటున్న అపార్ట్‌మెంట్ కింద కారు పార్క్ చేసి కారులోనే గుండెపోటుతో మరణించారు. ఉదయం కుటుంబ సభ్యులు చూసేసరికి మరణించి ఉండటాన్ని గమనించారు. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) భీమారావు, సీఐలు, ఎస్ఐలు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చెరువుకు గండి..కొట్టుకుపోయిన చేపపిల్లలు

మొగల్తూరు,జూలై 3: సరిహద్దు రైతు లోతుగా చెరువు తవ్వడంతో తాను సాగు చేసే చెరువు గట్టు గండిపడి అందులో గల చేపపిల్లలు కొట్టుకుపోయాయని మొగల్తూరు కోట ప్రాంతానికి చెందిన చెరువు లీజు రైతు మాదిరెడ్డి బాలాజీ వాపోయారు. 2 ఎకరాలు లీజుకు తీసుకుని చేపల చెరువు సాగు చేసుకుంటున్నానని ఇటీవల తన సమీపంలోని రైతు ఇసుక అమ్ముకోవడం కోసం భారీ లోతు తవ్వడంతో తన చెరువుకు గండి పడి చెరువులో గల రూ.8 లక్షలు విలువ గల చేపపిల్లలు సరిహద్దు చెరువు, బోదెలోకి కొట్టుకుపోయాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్‌పర్సన్ రత్నకుమారి

వైసీపీ ప్రభుత్వం సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చింది

రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్‌పర్సన్ ఎదుట సర్పంచ్‌ల ఆవేదన



ఆవేదన వ్యక్తం చేస్తున్న సర్పంచ్

ఏలూరు రూరల్, జూలై 3: "గ్రామానికి మొదటి వ్యక్తి సర్పంచ్. సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి నిధుల లేమితో కొట్టుమిట్టాడాం. పదవి ఉన్నా పవర్ లేని నేతగా కాలం ఈడ్చుకువచ్చాం... నిధుల విషయంలో ఎవరికి చెప్పుకోలేని దుర్భర పరిస్థితిని అనుభవించాం. ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది సైతం అవమాన పరిచేలా మాట్లాడారు. వైసీపీ పాలనలో గ్రామస్వరాజ్యం కనిపించకపోగా పంచాయతీ వ్యవస్థను అస్త వ్యస్తం చేశారు.." అంటూ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఎదుట పలువురు సర్పంచ్‌లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఏలూరు జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర ఆర్థిక కమిషన్ చైర్‌పర్సన్ రత్నకుమారి ఆధ్వర్యంలో ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు.ఏలూరు డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అధ్యక్షత వహించారు. రత్నకుమారి మాట్లాడుతూ స్వయం, సమృద్ధి ద్వారా ఆర్థిక వన రులు సమకూర్చుకోవాలన్నారు. డీపీవో విశ్వనాథ్ మాట్లాడుతూ వెనుకబడిన పంచాయతీలకు ప్రత్యేక గ్రాంటు విడుదల చేస్తే పంచాయతీలు బలోపేతం అవుతాయన్నారు.పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రథమ పౌరులైన తమను వైసీపీ ప్రభుత్వం ఉత్సవ విగ్రహాలుగా మార్చివేసిందని, సచివాలయ వ్యవస్థతో సర్పంచ్‌ల అధికారాలతో పాటు నిధులను కూడా లాగేసుకుందని, 14,15 ఆర్థికసంఘం నిధులను దారి మళ్లించిందని, నిధులు, విధుల కోసం పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని కమిషన్ సభ్యులు ప్రసాద్, కృపాకర్ పేర్కొన్నారు.



రెవెన్యూ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ నాయకులు

మంత్రి దృష్టికి క్యాస్ట్ సర్టిఫికెట్ ఇబ్బందులు

ఏలూరు రూరల్, జూలై 3: వీఆర్వోలు సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల విషయంలో పడుతున్న ఇబ్బందులు ఉన్నతాధికార ఒత్తిడిపై రాష్ట్ర ఐక్యవేదిక చైర్మన్ కె.ఆర్ సూర్యనారాయణతో పాటు రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు,మిర్యాల లక్ష్మీనారాయణ తదితరులు రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి బుధవారం వినతిపత్రం అందించారు. రవీంద్రరాజు మాట్లాడుతూ వీఆర్వోలు సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్‌లో అనేక ఇబ్బందులు పడుతున్నారని, గత ప్రభుత్వంలో కులగణన ద్వారా వలంటీర్లతో చేయించిన అసమగ్ర డేటాతో వీఆర్వోల లాగిన్‌లకు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వందల సర్టిఫికెట్లు పంపించి టార్గెట్‌లు పెట్టి పూర్తిచేయాలని ఒత్తిడి చేస్తున్నారని, దీనిపై పునరాలోచించి ఉన్న తాధికారులతో చర్చించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1గా ప్రమోషన్ జీవో 166 ఇచ్చి ఏడాది అవుతున్నా ఎక్కడా అమలు చేయలేదని, సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మానందంపై దాడి

ఉండి, జూలై 3: ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కనిగళ్ల బ్రహ్మానందంపై పలువురు యువకులు మంగళవారం రాత్రి మద్యం సేవించి దాడి చేశారు. ఉండి సంతమార్కెట్‌కు బ్రహ్మానందం వద్దకు విచ్చేసిన సమయంలో దాడికి పాల్పడినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బండాడ కేశవరావు తెలిపారు. గాంధీ చౌక్ పరిసర ప్రాంతంలో ఆకతాయిలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పోలీసులు దృష్టిపెట్టాలని, బ్రహ్మానందంపై దాడి చేసివారిని అరెస్ట్ చేయాలని కోరారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS
క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

PLOTS FOR SALE

■ రాజధాని గుంటూరు విజయవాడలలో 15 వెంచర్లలో CRDA ఫ్లాట్స్, పూలింగ్ ల్యాండ్స్, అపార్ట్మెంట్స్, పొలాలు మీకు అందుబాటు ధరలలో కలవు. సంప్ర॥ సెల్: 9390451999
AJO-183939

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైములతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా చెల్లించబడిన /క్లైమ్స్‌కు, దళ్ల వల్లరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ లావణ్యవేణి

ఎన్నికల ఖర్చు సమర్పించాలి : జేసీ

ఏలూరు రూరల్, జూలై 3: అభ్యర్థుల ఎన్నికల వ్యయంపై వివరాలు 30 రోజుల్లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు సమర్పించాల్సి ఉందని జేసీ బి.లావణ్యవేణి తెలిపారు. ఎంపీ, అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థుల తరపున ఏజెంట్లు, నియోజకవర్గ రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో కలెక్టరేట్‌లో అభ్యర్థుల ఎన్నికల వ్యయ నివేదికలపై వ్యయ పరిశీలకులు ఎం.గౌరవ్‌మధుకర్, జోర్డాన్ బూటియాతో బుధవారం సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ అభ్యర్థులు ఎన్నికల్లో వెచ్చించిన మొత్తానికి అకౌంట్స్ స్పష్టంగా చూపాలన్నారు. అభ్యర్థుల ఖర్చులు, రిజిస్టర్‌లో పేర్కొన్న ప్రొఫార్మాలో నింపి సమర్పించాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పరిశీలన గురించి తెలియజేస్తామన్నారు. సమావేశంలో డీఆర్వో డి.పుష్పమణి, రిటర్నింగ్ అధికారులు ఎస్.ఎస్.కె ఖాజావలీ, వై.భవానీశంకరి, ముక్కంటి, కలెక్టర్ ఏవో కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు రోడ్డు ఏర్పాటు చేయండి

కలెక్టర్ వెట్రి సెల్వికి కొండ రెడ్ల వినతి



రాజానగరం పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి

బుట్టాయగూడెం, జూలై 3: మారుమూల అటవీ ప్రాంతంలో రామ నరసాపురం గ్రామానికి రోడ్డుమార్గం ఏర్పాటు చేయాలని కలెక్టర్ కె.వెట్రి సెల్విని కొండరెడ్లు కోరారు. బుధవారం ఏజెన్సీ ప్రాంతానికి వచ్చిన కలెక్టర్ రామ నరసాపురంలో కొండరెడ్లతో మాట్లాడారు. మారుమూల ప్రాంతంలో ఉన్న గ్రామం నుంచి ఐటీడీఏ, మండల కేంద్రానికి రావాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నామని తమకు అత్యవసరంగా రోడ్డును నిర్మించాలని కోరారు. తమ గ్రామం పులిరాముడుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్నందున సుమారు 20 కిలో మీటర్ల దూరం ఆసుపత్రికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామన్నారు. దగ్గరలోని ఎల్ఎన్‌డీ పేట పీహెచ్‌సీకి వెళితే గ్రామం తమ పరిధిలో లేదని వైద్యం చేయడంలేదని, అందుబాటులో వైద్యసేవలు అందేలా చూడాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుచేసి వైద్య సేవలు అందించాలని కోరారు. ముఖ్యంగా గ్రామంలో మంచినీరు బాగులేదని మోటారు, చేతిపంపులు ద్వారా సుద్దనీరు వస్తుందని నీటిని త్రాగడం వలన కిడ్నీలో రాళ్ళు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మంచినీటిని అందించే చర్యలు చేపట్టాలని కోరారు. తమకు పథకాలు అందేలా చూడాలన్నారు. తర్వాత గ్రామంలోని అంగనవాడీ కేంద్రాన్ని, గిరిజన ప్రైమరీ స్కూల్‌ను కలెక్టర్ సందర్శించారు. అనంతరం రాజానగరంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను ఆమె సందర్శంచారు. 10వ తరగతి పిల్లలతో మాట్లాడారు. పిల్లలు యోగాసానాలు చేస్తుండగా ఆసక్తిగా చూశారు. వసతిగృహంలో అందుతున్న సౌకర్యాలు, విద్య ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. మూడో తరగతి చదువుతున్న చిన్న పిల్లలు వసతిగృహంలో ఉండగలుగుతున్నారా అంటూ వార్డెన్, హెచ్ఎంలను ప్రశ్నించారు. చిన్నపిల్లల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అనంతరం కలెక్టర్ ఐటీడీఏకు చేరుకున్నారు. అధికారులతో సమీక్ష చేస్తారని భావించిన మరోసారి సమీక్ష చేస్తామని చెప్పి ఏలూరు వెళ్ళిపోయారు. కార్యక్రమంలో పీవో ఎం.సూర్యతేజ, ఏపీవో పీవీఎస్ నాయుడు, డీవైఈవో కె.నాలయ్య, ఏఎంవో కె.శిరమయ్య, తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లు, హెచ్ఎం వెంకమ్మ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రత్నకుమారి

నగర ప్రజలకు మెరుగైన పాలన అందించాలి

ఏలూరు టూటౌన్, జూన్ 3: నగర ప్రజలకు మెరుగైన పాలన అందించడానికి ఆర్థికపరమైన అంశాల్లో తోడ్పాటు అందిస్తామని 5వ ఆర్థిక సంఘం ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎస్.రత్నకుమారి అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం అధికారులతో ఆమె సమావేశమయ్యారు. కార్పొరేషన్ ఆర్థిక పరిస్థితి, నిధుల లభ్యత, రాబడి ఖర్చులు, తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నగర కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ కుళాయి పన్నులు, ఆస్తి పన్నుల చెల్లింపుల గురించి వివరించారు. సిబ్బంది చెప్పిన విషయాలు పరిగణాలోకి తీసుకొన్న రత్నకుమారి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. ప్రజలకు సౌకర్యాలందించాలంటే ఆర్థిక పరిపుష్టి అవసరమన్నారు. ఆర్థిక సంఘం మెంబర్ సెక్రటరీ డాక్టర్ కేవీ.రమణారెడ్డి, మెంబర్లు ఎంవీఎస్ పద్మారావు, ఎం.ప్రసాదరావు, ఎంహెచ్‌ఓ మాలతి, ఏసీపీ తిరుపతిరావు, ఎస్ఈ.వెంకటేశ్వర్లు, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ నిరుపేద విద్యార్థులకు సీట్లు కేటాయించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సభ్యులు

ఏలూరు రూరల్, జూలై 3: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎస్సీ నిరుపేద విద్యార్థులకు సీట్లు కేటాయించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ నిరుపేద విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో సీట్లకోసం మంత్రికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ప్రవేశాలు పూర్తయాయ్యయని డీసీవో చెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పందుల రమేష్ పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



ఐటీడీఏ వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

బుట్టాయగూడెం, జూలై 3: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల గిరిజనులు ఐటీడీఏ వద్ద బుధవారం ఆందోళన చేశారు. అనంతరం గిరిజన దర్బార్‌లో ఏపీవో పీవీఎస్ నాయుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు, కొత్త పునరావాస గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అసంపూర్తిగా నిర్మించిన ఇండ్లను పూర్తిచేయడం, లీకేజీలను అరికట్టడం తదితర సమస్యలను పరిష్కరించాలని మిడియం వెంకటస్వామి, మూలెం రాంబాబు, మిడియం వెంకటేష్, ముచ్చిక రంజిత్‌కుమార్, కుంజం బుచ్చిరాజు, సరియం విజయరత్నం, బాబురావు, బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

దిశ వన్‌స్టాప్ సెంటర్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, జూలై 3: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ బుధవారం దిశ వన్‌స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేశారు. తాత్కాలిక వసతిగృహంలో బాధితులకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ పోర్టల్ పరిశీలించారు. వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించిన బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహించి కలసి జీవించేలా భార్యాభర్తలకు సూచించారు. కౌన్సెలింగ్ నిర్వహించడంపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ నిర్మల, స్టాండింగ్ కౌన్సిల్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర కాలువ మిగులు భూములు పేదలకు పంచాలి



మిగులు భూములలో పేదల ఆందోళన

టి.నరసాపురం, జూలై 3: ఎర్ర కాలువ రిజర్వాయర్ ప్రాజెక్టు మిగులు భూములను పేదలకు పంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి డిమాండ్ చేశారు. ఎర్ర కాలువ మిగులు భూమిలో బుధవారం జెండా పాతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి భూపోరాటాన్ని ప్రారంభించారు. ఎనిమిదేళ్లుగా భూపోరాటం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. చట్టాన్ని ధిక్కరించి భూములను భూస్వాములకు ఏవిధంగా కట్టబెడతారని ప్రశ్నించారు. నాటి ప్రభుత్వం రిజర్వాయర్ కోసం సేకరించిన భూములకు అప్పటి రేటు కేటాయించి రైతులకు, భూస్వాములకు పూర్తిస్థాయి పరిహారం ఇచ్చిందని తెలిపారు. కానీ పరిహారం పొందిన వాళ్ళే నేడు భూములను సాగు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. భూమి లేని దళితులు, గిరిజనులు, ఇతర పేదలకు భూములు అప్పజెప్పాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు తామా ముత్యాలమ్మ, మండపం సుధారాణి, యాగంటి సీత, అనుమోలు మురళి, గంగాభవాని, రామలక్ష్మి, దళితులు, గిరిజనులు పాల్గొన్నారు.

విదేశీ నిపుణులకు సాగునీటి సంఘాల సమాఖ్య సన్మానం



విదేశీ నిపుణులను సత్కరించిన నాయకులు

పోలవరం, జూలై 3: పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన విదేశీ నిపుణుల బృందానికి బుధవారం రాష్ట్ర సాగునీటి సంఘాల నాయకులు సన్మానం చేశారు. ఆళ్ళ గోపాలకృష్ణారావు నిపుణులతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణ సమస్యలను పరిష్కరించడానికి వచ్చిన విదేశీ నిపుణులకు దేశం తరపున రాష్ట్రం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పట్టిసీమ ద్వారా సాగునీరు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నిమ్మలకు సాగునీటి సంఘాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి నిమ్మల రామానాయుడికి సన్మానం

పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడుకు కూటమి నాయకులు, నీటి సంఘాల నాయకులు శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఆళ్ళ గోపాలకృష్ణారావు, గుత్తా శివరామకృష్ణ, కౌలూరి రాజా చంద్ర మౌళి, బొరగం శ్రీనివాసులు, యడ్ల వినోద్, కరిబండి నాగరాజు, తెలగంశెట్టి రాంప్రసాద్, అనిత కుమారి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు.

బోట్ పాయింట్ ఏర్పాటు చేయాలని వినతి

పోలవరం ప్రాజెక్టులో పాతపైడిపాక గ్రామం వైపు బోట్ పాయింట్ ఏర్పాటు చేయాలని బోట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నిమ్మల రామానాయుడికి వినతిప్రతం అందజేశారు. పోశమ్మగండి ప్రాంతంలో బోట్ పాయింట్‌ను పాతపైడిపాక గ్రామం వైపు ఏర్పాటు చేయడం ద్వారా ఉభయ గోదావరి జిల్లాల పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.

నిధుల మంజూరులో పక్షపాత ధోరణి

మండల సమావేశంలో సర్పంచ్‌ల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, జూలై 3: గ్రామాలకు నిధుల మంజూరులో పక్షపాత ధోరణి అవలంబించారని కాకర్లమూడి, తల్లాపురం సర్పంచ్‌లు కాళ్ళ సత్యనారాయణ, పసుపులేటి నరసింహారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగిన మండల పరిషత్ సమావేశంలో పలువురు సమస్యలు ప్రస్తావించారు. జలజీవన్ నిధుల కేటాయింపులో అన్ని గ్రామాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు ప్రజా ప్రతినిధులు కోరారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ సమస్యలపై పార్టీలకతీతంగా పోరాడాలన్నారు. ముందుగా ఎమ్మెల్యే ధర్మరాజును పలువురు పుష్పగుచ్ఛాలతో అభినందించారు. సమావేశంలో జడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీడీవో శర్మ, తహసీల్దార్ కట్టా శివయ్య, వైస్ ఎంపీపీలు విద్యా లక్ష్మి, సూరిబాబు పాల్గొన్నారు.

వరి సాగు.. సమగ్ర యాజమాన్యంపై శిక్షణ



రావికంపాడులోని వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చింతలపూడి, జూలై 3: వరి సాగు, కలుపు, ఎరువుల యాజమాన్యంపై రైతులు మెలకువలు తెలుకోవాలని గుంటూరు జిల్లా ఏరువాక కేంద్ర సమన్వయకర్త డాక్టర్ ఫణికుమార్ సూచించారు. సమ్మెటవారిగూడెంలో బుధవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో రైతులకు సూచనలు ఇచ్చారు. అధిక దిగుబడులు సాధించటానికి మంచి వరి విత్తనాలను వినియోగించుకోవాలన్నారు. సాగు పద్ధతులపై శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో ఏడీఏ లలిత సుధ, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త ఎస్.నాగేంద్రబాబు, ఏవో మీనాకుమారి, రైతులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: ఆచార్య ఎన్‌జి రంగ వ్యవసాయ విశ్వ విద్యాలయం, గుంటూరు పరిధిలోని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు రావికంపాడులో రైతులకు శిక్షణ ఇచ్చారు. వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.ఫణికుమార్ మాట్లాడుతూ వరిలో నారుమడి, ప్రధాన పొలంలో కలుపు యాజమాన్యం వివరించారు. వరి సాగులో రైతు సందేహాలను నివృత్తి చేశారు. ఏడీఏ లలిత సుధ పలు సూచనలు ఇచ్చారు. ఏవో పవనకుమార్ కలుపు నివారణ చర్యలను వివరించారు. శాస్త్రవేత్త ఎస్.నాగేంద్రబాబు, విఏఏ నూతి వెన్నెల, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

వరి నాట్లకు రైతులు సన్నద్ధం

లింగపాలెం: మండలంలో వరి నాట్లకు రైతులు సిద్ధమవుతున్నారు. మండలంలో 350 ఎకరాల్లో వరి నారుమడులు సిద్ధం చేశారు. రైతులకు 350 క్వింటాళ్ల పచ్చిరొట్ట సబ్సిడీ పంపిణీ చేయడంతో ముందుగానే పొలాల్లో చల్లి రైతులు ఉపయోగించుకున్నట్లు ఏవో మురళీకృష్ణ తెలిపారు. పది రోజుల్లో నాట్లు వేయటానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. వర్షాలు సమృద్ధిగా పడడంతో రైతులు సాగుకు సిద్ధమయ్యారు.

కలెక్టర్ చొరవతో వృద్ధుడికి పింఛన్ పంపిణీ

ఏలూరు రూరల్, జూలై 3: ఒక వృద్ధుడు తనకు పింఛన్ అందలేదని కలెక్టర్ కె.వెట్రిసెల్వికి వాట్సాప్ నెంబర్ ద్వారా తెలియజేశాడు. కలెక్టర్ వెంటనే స్పందించి అధికారులను ఆదేశించడంతో గంటల వ్యవధిలోనే ఆ వృద్ధుడికి సచివాలయ సిబ్బంది పింఛన్ అందజేశారు. పోలవరానికి చెందిన యు. వెంకటరమణమూర్తి గతనెల ప్రమాదానికి గురవడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కలెక్టర్‌కు వాట్సాప్ ద్వారా సమస్యను తెలియచేశాడు. స్పందించిన కలెక్టర్ తక్షణం రమణమూర్తికి పింఛన్ అందజేయాలని డీఆర్‌డీఏ పీడీ ఆదేశించారు. సమస్యను వెంటనే పరిష్కరించిన కలెక్టర్‌కు లబ్ధిదారు కృతజ్ఞతలు తెలిపారు.

ఏజెన్సీలో పిసా చట్టం పటిష్టంగా అమలు చేయాలి

కుక్కునూరు, జూలై 3: ఏజెన్సీలో పిసా చట్టం పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు కూరం సంజీవరావు డిమాండ్ చేశారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెదరావిగూడెంలో నిబంధనలకు విరుద్ధంగా టోల్‌ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పిసా చట్టం ఏమాత్రం అమలు చేయడం లేదన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు కార్పొరేషన్, జూలై 3: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అన్నే భవన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ ఆక్వా రైతుల కృషితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం సమకూరుతుందన్నారు. కానీ వారికి నష్టాలు, కష్టాలే మిగులుతున్నాయన్నారు. విద్యుత్ రాయితీ, నాణ్యమైన సీడ్, ఫీడ్ ధరలు నియంత్రించాలని కోరారు.

నాయీ బ్రాహ్మణులకు ప్రాధాన్యం ఇవ్వాలి

చింతలపూడి, జూలై 3: నాయీ బ్రాహ్మణులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని జిల్లా సంఘ అధ్యక్షులు కొప్పెర్ల నాగరాజు, ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌ను కోరారు. చింతలపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జిల్లా సంఘ సభ్యులతో కలసి నాయీబ్రాహ్మణులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తూ కమ్యూనిటీహాల్ కూడా మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కేవీవీ.సత్యనారాయణ, నందిగం సుబ్బారావు, కె.పాండు, ఎస్.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ జ్వరాలపై అవగాహన

ఏలూరు అర్బన్, జూలై 3: డెంగీ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు సూచించారు. స్థానిక మాగంటి వారి వీధిలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సు, ర్యాలీలో ఆయన మాట్లాడారు. వారానికోసారైనా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించాలన్నారు. దోమల లార్వాలను అరికట్టడం ద్వారా డెంగీ జ్వరాలను నియంత్రించవచ్చన్నారు. వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, రమేష్ బాబు, రాంబాబు, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రూ. 2 లక్షల విలువైన కలప స్వాధీనం



అక్రమంగా నిల్వ చేసిన కలప

వేలేరుపాడు, జూలై 3: పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో అక్రమంగా నిల్వ ఉంచి కలపను అటవీ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. పొదల్లో దాచి ఉంచిన 20 అటవీశాఖా కార్యాలయానికి తరలించారు. వీటి విలువ సుమారు రూ.2లక్షలు ఉండవచ్చని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె.సోమరాజు తెలిపారు. కలప నిల్వ చేసిన వారిని గుర్తించి కేసు నమోదు చేస్తామన్నారు. కలప స్వాధీనం చేసుకున్న వారిలో అటవీ ఉద్యోగులు లక్ష్మి, సంతోష్, శ్రీకాంత్, రామకృష్ణ, సాగర్, తదితరులు ఉన్నారు.

రైలు ఎక్కుతూ.. జారిపడి వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, జూలై 3: రైలు ఎక్కుతున్న వృద్ధురాలు జారి రైలు కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వేలేరుపాడు మండలం కొయ్యమాదారం గ్రామానికి చెందిన ఎనుముల వెంకటేశ్వరమ్మ (60) చిన్నాన్న ముంగర వెంకన్నతో కలిసి నెల్లూరులో కుమార్తెను చూడడానికి వెళతోంది. ఏలూరు రైల్వే స్టేషన్‌లో యశ్వంత్‌పూర్ రైలు ఎక్కుతుండగా జారి రైలు కిందపడి బుధవారం మృతి చెందింది. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐడి నరసింహారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బ్యాంక్ ఖాతాలో రూ.35 వేలు మాయం

జంగారెడ్డిగూడెం, జూలై 3: పట్టణానికి చెందిన యర్రసాని ఆంజనేయులు బ్యాంకు ఖాతా నుంచి రూ.35 వేలు కొట్టేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూన్ 30న ఉదయం ఆంజనేయులు మొబైల్‌కు ఓటీపీ వచ్చింది. అతడు పట్టించుకోలేదు. అయితే కొద్ది సేపటికి రూ.5వేలు, తర్వాత 30 వేలు తన బ్యాంకు ఖాతా నుంచి కట్ అవడంతో లబోదిబోమన్నాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

642 లీటర్ల సారా, 328 లీటర్ల మద్యం ధ్వంసం

జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో పట్టుబడిన 642 లీటర్ల సారా, 328 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశారు. ఎస్ఈబీ సూపరిండెంటెంట్ కె.రామకృష్ణ సమక్షంలో ధ్వంసం చేసినట్లు సీఐ వై.పట్టాభి చౌదరి తెలిపారు.

టీచర్ల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

ఏలూరు ఎడ్యుకేషన్, జూలై 3: టీచర్లకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని ఏపీటీఎఫ్ ప్రతినిధులు కోరారు. ఏపీటీఎఫ్ నగరశాఖ సమావేశం సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో బుధవారం జరిగింది. మధ్యంతర భృతి, మెరుగైన పీఆర్సీని ప్రకటించాలని సంఘ ఉపాధ్యక్షుడు సుబ్బారావు డిమాండ్ చేశారు. అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే జీవో 117 ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లోనే 3,4,5 తరగతులు కొనసాగేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. తల్లికి వందనం నగదు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలన్నారు. సంఘ నాయకులు వెంకటరత్నం, శ్రీనివాసరావు, పోట్టియ్య, సూర్యప్రకాష్, జ్యోత్స్న, రోజా, శాంతికుమార్, వెంకటేశ్వరరావు, సాంబమూర్తి, బెనర్జీ పాల్గొన్నారు.

యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి

దెందులూరు, జూలై 3: యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు ముమ్మడి చింతయ్య యాదవ్ అన్నారు. చల్లచింతలపూడిలోని ముమ్మడి మోహన్‌రావు జిల్లా నాయకులు నాగనబోయిన సత్యనారాయణ, నాయకుల ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్రనేత నెరుసు వెంకట సుబ్బయ్య యాదవ్, చింతయ్య యాదవ్ మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో యాదవుల కమ్యూనిటీ హాల్, కల్యాణ మండపాల నిర్మాణానికి ఐక్యంగా కృషి చేద్దామన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు యిప్పిలి వెంకటేశ్వరావు, జిల్లా నాయకులు పెనుబోయిన మహేష్ యాదవ్, కొలుసు నాని, నున్న లక్ష్మణ్‌బాబు, పేరం ఏసుదాసు, గొరిపర్తి బంటు, నాగేంద్ర, కట్టా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

జంగారెడ్డిగూడెం, జూలై 3: జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పది మండలాల ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్పీలకు జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ తరగతులు బుధవారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. శిక్షణ తరగతులను జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.రామారావు పరిశీలించారు. టీచ్‌టూల్ జిల్లా కోఆర్డినేటర్ బి.చంద్రశేఖర్, కోర్సు డైరెక్టర్, ఎంఈవోలు జి.రాముడు, బి.రాములు, తదితరులు ఉన్నారు.

నిర్వాసితుల తాగునీటి సమస్య పరిష్కారం

కుక్కునూరు, జూలై 3: కుక్కునూరులోని ఎ బ్లాక్ నిర్వాసితులు రెండేళ్లుగా తెల్లరాయిగూడెం పునరావాస కాలనీలో నివాసం ఉంటున్నారు. దాదాపు వంద కుటుంబాలు పైగా జీవిస్తున్నారు. రెండేళ్లుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కూటమి నాయకుల ఆధ్వర్యంలో బుధవారం నాలుగు బోర్లు నిర్మించి చేతిపంపు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం నిర్వాసితులను ఏమాత్రం పట్టించుకోలేదని కూటమి నాయకులు ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు నాగేశ్వరరావు, యుగంధర్, ఎం.సాంబశివరావు, రమణరాజు, ఎం.వెంకన్నబాబు పాల్గొన్నారు.

ప్రాణదాన ట్రస్టుకు మందులు అందజేత

ద్వారకాతిరుమల, జూలై 3: చిన వెంకన్న ఆలయంలో నిర్వహిస్తున్న ప్రాణదాన ట్రస్టుకు దాతలు మందులను అందజేశారు. తెనాలికి చెందిన శ్రీశైల సేవాసమితి అధ్యక్షుడు సుబ్బయ్య, గోవర్ధన్, గుప్తా తదితరులు కాలి నడకన వచ్చే భక్తులకు అందించాలని ట్యాబెట్లు, ఇంజెక్షన్‌లను అందజేశారు. సుమారు 3 వేల మంది పాద యాత్రికలకు సరిపోతాయని సమితి మెడికల్ ఇన్‌చార్జ్ ఎం.పూర్ణచంద్రరావు, సాంబశివరావు తెలిపారు. డిప్యూటీ ఈవో బాబూరావు, వైద్యులు రాజేంద్రప్రసాద్, దాస్యం ప్రసాద్‌కు అందించారు.

వసంత్‌నగర్ కాలనీలో బోరు బావి ఏర్పాటు

ద్వారకా తిరుమల, జూలై 3: వసంత్‌నగర్ కాలనీలో ఆరు నెలలుగా ఉన్న మంచినీటి సమస్య పరిష్కారం దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. కొత్త బోరు బావి నిర్మాణానికి టీడీపీ నాయకులు ఓం ప్రకాష్‌చౌదరి బుధవారం శంకుస్థాపన చేశారు. కొబ్బరి కాయలు కొట్టి బోరుబావి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. స్థానికులకు తాత్కాలికంగా దగ్గరలో ఉన్న వ్యవసాయ బోరుబావి నుంచి ట్రాక్టర్ల ద్వారా నీరు పంపిణీ చేయించారు.

విద్యార్థులకు చదువుతోనే ఉన్నతి

ఏలూరు రూరల్, జూలై 3: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలని మాజీ ఎంపీపీ లంకపల్లి మాణిక్యాలరావు అన్నారు. శనివారపుపేట ఇందిరాకాలనీ పాఠశాల విద్యార్థులకు బుధవారం స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, షూ అందజేశారు. డివిజన్ ఇన్‌ఛార్జ్ మట్టా రంజిత్, మాజీ జడ్పీటీసీ మట్టా రాజేశ్వరి, మాజీ ఎంపీపీ అద్దంకి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఆళ్ళమోహన్‌రావు, సోమిశెట్టి రామ్మోహన్‌రావు, బి.కుటుంబరావు, ఎస్.కె షఫీ, ఎస్.కె చాన్‌భాష తదితరులు పాల్గొన్నారు.

చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్ సాధించిన నవదీప్

ఏలూరు టూటౌన్, జూన్ 3: చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్ సాధించిన కావూరి నవదీప్‌ను ఎమ్మెల్యే బడేటి చంటి అభినందించారు. బడేటి క్యాంపు కార్యాలయంలో నవదీప్, కోచ్, తల్లిదండ్రులు ఎమ్మెల్యే చంటిని కలిశారు. ఏప్రిల్ 25న విజయ వాడలో జరిగిన స్పార్క్ ఇంటర్నేషనల్ ఓపెన్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో జూన్ 4 నుంచి జరిగిన ఇంటర్నేషన్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో రేటింగ్ పాయింట్ పెంచుకున్నాడని అన్నారు. కార్యక్రమంలో కోచ్ లక్ష్మణరావు, కావూరి వేణుగోపాల్, సూర్యనారాయణ, పాల్గొన్నారు.

నేడు ఎర్ర కాలువ జలాశయం నీరు విడుదల

జంగారెడ్డిగూడెం, జూన్ 3: కొంగువారిగూడెం లోని శ్రీ కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం నుంచి గురువారం నీరు విడుదల చేయనున్నారు. కుడి, ఎడమ కాలువల ద్వారా ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ నీటిని విడుదల చేస్తారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు.

అల్లూరి సీతారామరాజు నేటి తరానికి ఆదర్శం



అల్లూరి చిత్రపటం వద్ద వాకర్స్ నివాళి

ఏలూరు రూరల్, జూలై 3: అల్లూరి సీతారామరాజు జీవితం నేటితరానికి ఆదర్శమని, ఏపీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఏఎస్ఆర్ స్టేడియంలో మార్నింగ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎం అక్బర్, ఎల్ఎస్.జగదీశన్, ఎస్‌కె సత్తార్, లాలు సాహెబ్, గొంతెన రామకృష్ణ, మాధవరావు, జంపా సూర్యనారాయణ, జెల్లా వీరభద్రరావు, కె.అరుణ, మేరీమాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

అమలోద్భవి పాఠశాలలో..



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

అశోక్‌నగర్‌లోని అమలోద్భవి ఇంగ్లీష్‌మీడియం, పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. మానవత అధ్యక్షుడు అజయ్‌బాబు మాట్లాడుతూ నగరంలోని పలు పాఠశాల, కళాశాలల్లో సీతారామరాజు వీరోచిత పోరాటాన్ని వివరిస్తున్నామన్నారు. సోషల్ వర్కర్ బొంతిన రామకృష్ణ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ధైర్యానికి, త్యాగానికి మారుపేరుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో గుడిపాటి నరసింహారావు, సోమ్లా నాయక్, ముళ్ళపూడి రాజు,ఆ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రులను కలసిన ఎమ్మెల్యే బడేటి చంటి



మంత్రి కొల్లు రవీంద్రతో చంటి, గన్ని

ఏలూరు టూటౌన్, జూన్ 3: అమరావతి సచివాలయంలో విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రెవెన్యూ మంత్రి సత్య ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే బడేటి చంటి కలిశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఉన్నారు. జిల్లా అబివృద్ధికి కావల్సిన అంశాలపై మంత్రులతో చర్చించారు.

నేడు వరదలపై సమీక్షా సమావేశం

వేలేరుపాడు, జూలై 3: వర్షాకాలంలో గోదావరి నదికి వరదలు సంభవించే అవకాశాలు ఉండడంతో ముందస్తు జాగ్రత్తలపై గురువారం ఎంఈవో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు డీటీ రమేష్ బుధవారం తెలిపారు. ఆర్డీవో అద్దయ్య అధ్యక్షతన సమీక్షా సమావేశం జరుగుతుందని, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొంటారని తెలిపారు. మండలంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని సూచనలు ఇవ్వాలరి ఆయన కోరారు.

లైంగిక వేధింపుల నివారణపై నేడు సమావేశం

ఏలూరు క్రైం, జూలై 3: పనిచేసే సమయంలో మహిళలపై లైంగిక వేధింపులు నివారణ చట్టం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం గురువారం జరగనుంది. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి కేవీఎల్ పద్మావతి బుధవారం తెలిపారు. కమిటీ సభ్యులు, నోడల్ అధికారులు, ప్రజలు సమావేశానికి హాజరు కావాలన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** సీఐటీయూ వ్యవస్థాపక జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లూరు సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు.
- **బుట్టాయగూడెం :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ పీయూవీఎస్.మణీంద్రరావు తెలిపారు. ఈ నెల 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు హెల్ప్ డెస్క్ నెంబర్లు 9490663788, 9493476529, 9347286347, 9573159983 నెంబర్లలో సంప్రదించాలని తెలియజేశారు.
- **ఉంగుటూరు :** చేబ్రోలు సొసైటి ప్రత్యేక అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కే.ఎస్.మూర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ధర్మరాజును కలుసుకుని అభినందించారు. ఆయనతో పాటు ఇన్‌చార్జి కార్యదర్శి యర్రా శ్రీనివాసరావులు కలసి పలు అంశాలపై చర్చించారు.
- ఉంగుటూరు మండలం నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంకాం.కోర్సు (ఆంగ్లమాధ్యమం)కు అనుమతి లభించిందని ప్రిన్సిపాల్ టి.కె.విశ్వేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అభివృద్ధి కమిటీ కోరింది.
- **జీలుగుమిల్లి :** సీపీఎం ఆధ్వర్యంలో అంకన్నగూడెం శివారు దిబ్బగూడెం గిరిజన గ్రామంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. డీసీసీబీ విశ్రాంత మేనేజరు చంద్రకాంత్ సాయంతో పేద గిరిజనులకు అందజేశరు. తెల్లం రామకృష్ణ, తెల్లం దుర్గారావు, జి.వెంకట్రావు, సీహెచ్.సీతారామయ్య, కె.నాగదుర్గ, కె.దేవీదు, జి.గంగరాజు ఉన్నారు.
- **భీమడోలు :** గుండుగొలను విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. సీఐ రవికుమార్, ఎస్ఐ సుధాకర్ మాట్లాడారు. నాగభూషణం, సురేష్, దాట్ల కృష్ణంరాజు, సీతారామరాజు, రేవంత్‌రాజు, గేదెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- **జంగారెడ్డిగూడెం :** ఎస్ఈబీ స్టేషన్‌లో వివిధ కేసులలో పట్టుబడిన 33 ద్విచక్ర వాహనాలను జిల్లా సూపరిండెంటెంట్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఎస్సై సిహెచ్ రాజేష్‌సిబ్బంది ఉన్నారు.
- జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. విద్యార్థులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.
- నీట్ పరీక్షలు రద్దు కోరుతూ విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం పిలుపునిచ్చారు.
- **ద్వారకా తిరుమల :** ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును ద్వారకాతిరుమల టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ఇమ్మడి రత్నాజీ ఆయనను కలసి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందించారు.
- గోవులకు తరచు వైద్య పరీక్షలు చేయించాలని పశువైద్యాధికారి అంగర సురేష్ సూచించారు. శ్రీవారి దేవస్థానం గోసంరక్షణశాలలో 65 గోవులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు, చూడి నిర్ధారణ పరీక్షలు చేశారు. సుమారు 300 పైబడి ఆవులకు గొంతు వాపు వ్యాధి టీకాలు వేశారు. ఏఈవో నటరాజు, సూపరింటెండెంట్ కిశోర్, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ హెడ్ ట్యాంక్‌ను తొలగిస్తాం

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ట్యాంక్ పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

కలిదిండి, జూలై 3 : కూలేందుకు సిద్ధంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ తొలగింపునకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జి.త్రినాథ్ బాబు అన్నారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పెదలంకలో శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు. పక్కనే ఉన్న జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ట్యాంక్ వైపు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్ తొలగింపునకు అనుమతులు మంజూరు చేసిన వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శాస్త్రి, ఏఈఈ బి.నాగబాబు, సర్పంచ్ లక్ష్మీరామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నాగబాబు పాల్గొన్నారు.



విద్యుత్‌శాఖాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

కైకలూరు, జూలై 3: గ్రామంలో ఎక్కడా లోఓల్టేజ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం వరహాపట్నంలోని తన స్వగృహం వద్ద విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ వర్షాకాలంలో చిన్నపాటి గాలులకే విద్యుత్ అంతరాయాలు ఏర్పడతాయని వాటిని ముందుగానే గుర్తించి సరిచేయాలన్నారు. ఆక్వారంగానికి నిరంతరంగా విద్యుత్‌ను సరఫరా చేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట్ల సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారుచేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ ఈఈలు బి. రామయ్య, డి. దశరథన్, ఏఈలు పీవీఎన్ రవికుమార్, కె. శ్రీనివాసమూర్తి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భోజన వితరణ భేష్

పేదలకు అన్నదానం, ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం కూటమి నాయకుడు బూరుబోయిన శ్రీనివాసరావు తన పుట్టినరోజును పురస్కరించుకుని లోకుమూడి దత్తాశ్రమంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, కైకలూరు తాలుకా సెంటర్లో అన్న క్యాంటీన్ వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్యశిబిరంలో 35 మంది రక్తదానం చేశారు. అన్నక్యాంటీన్ వద్ద 400మంది పేదలకు ఉచితంగా భోజనాన్ని అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు, బూరుబోయిన శ్రీనివాసరావు, కూటమి నాయకులు కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మివ్మ, వేములపల్లి కారుణ్య తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీఆర్‌కు ఘన నివాళులు

కైకలూరు, జూలై 3: సినీ దిగ్గజం ఎస్వీ రంగారావు 106వ జయంతి వేడుకలను కైకలూరులో ఘనంగా నిర్వహించారు. బుధవారం నియోజకవర్గ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్వీ రంగారావు చిత్రపటానికి నివాళులర్పించి కేక్ కట్ చేసి పేదలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు చుండూరి రంగారావు మాట్లాడుతూ ఎస్వీ రంగారావును తెలుగు ప్రజలు మరువలేరన్నారు. సంఘ సభ్యులు నంబూరి హరికృష్ణంరాజు, సోబుల సత్యనారాయణ, గిరి సత్యనారాయణ, జి. భాస్కరరావు, వై. వేణుగోపాలరావు, కమ్మిలి సుబ్బారావు, కండబోతు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి చెరువు ఏర్పాటుపై వివాదం

సర్వేను అడ్డుకున్న మత్స్యకార సొసైటీ

మండవల్లి, జూలై 3: మండవల్లి మండలం చావలిపాడులో కొత్తగా మంచి నీటి చెరువు ఏర్పాటుపై బుధవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామాన్ని ఆనుకొని ఉన్న 14 ఎకరాల పంచాయతీ చెరువులో 5 ఎకరాలు మంచినీటి చెరువుగా మార్చేందుకు పంచాయతీ తీర్మానం చేసింది. భూమిని సర్వే చేసేందుకు రెవెన్యూ అధికారులు బుధవారం చేరుకోగా చెరువు ద్వారా లబ్ధి పొందుతున్న మత్స్యకార సొసైటీ సభ్యులు అడ్డుకున్నారు. దీనిపై గ్రామస్థులు, మత్స్యకార సొసైటీ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న సీఐ కృష్ణకుమార్, ఎస్సై రామచంద్రరావు, మండవల్లి తహసీల్దార్ సుబాని సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. ఇరువర్గాలను గురువారం మండవల్లి రెవెన్యూ కార్యాలయానికి రావాలని ఆదేశించారు.

క్రైం సమాచారం





కత్తి పోట్లకు గురైన బాలాజీ దంపతులు

అన్నపై తమ్ముడి హత్యాయత్నం

దారిలోకి మురుగునీరు వస్తోందని ఘర్షణ

ముదినేపల్లి, జూలై 3 : ఇళ్లకు వెళ్లే నడకదారిలో మురుగునీటి సమస్య దీర్ఘకాలంగా పరిష్కారం కాగా, చివరికి హత్యాయత్నానికి దారి తీసిన సంఘటన ముదినేపల్లి మండలం చిగురుకోట గ్రామంలో బుధవారం జరిగింది. స్వయానా అన్నదమ్ముల మధ్య జరిగిన ఈ సంఘటనపై ముదినేపల్లి ఎస్‌ఐ వెంకట్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిగురుకోట గ్రామానికి చెందిన పరసా వెంకట బాలాజీ, అతని తమ్ముడు చిన్నతనంలోనే దత్తత వెళ్లిన తుమ్మా సురేష్ ఒకే బజారులో పక్క పక్క ఇళ్లల్లోనే నివాసం ఉంటున్నారు. బాలాజీ ఇంటికి వెళ్లే నడక దారిలోకి సురేష్ ఇంటి నుంచి కొంత కాలంగా మురుగు నీరు వస్తున్నది. దీనిపై తరచూ ఇద్దరి మధ్య వివాదాలు ఏర్పడి గొడవలు జరిగేవి. గ్రామ పెద్దలు పరిష్కరిస్తూండేవారు. అయినా సురేష్ ఇంటి నుంచి దారిలోకి మురుగునీరు రావటం ఆగలేదు. ఈ పరిస్థితుల్లో బుధవారం ఉదయం ఈ విషయమై బాలాజీ భార్య దేవి, సురేష్ భార్య అనిత మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో అక్కడికి వచ్చిన బాలాజీతోపాటు అతని భార్య దేవిపై సురేష్ కత్తితో అతని భార్య అనిత చాకుతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటనలో బాలాజీ, దేవిలకు తీవ్ర గాయాలయ్యాయి. పెనుగులాటలో కత్తి గీసుకుని సురేష్, అనితకు కూడా గాయాలయ్యాయి. వెంటనే వారిని గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం బాలాజీ, దేవిలను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి ఎస్‌ఐ దర్యాప్తు చేస్తున్నారు.



పట్టించుకోకుంటే ముప్పే!

- ప్రమాదకరంగా అన్నవరం డ్రైన్‌పై వంతెన
- దిమ్మెలకు బీటలు
- స్లాబు అడుగున ఇనుముకు తుప్పు..

ముదినేపల్లి, జూలై 3 : ముదినేపల్లి మండలం సింగరాయపాలెం వద్ద అన్నవరం మీడియం డ్రైన్‌పై ఉన్న పురాతన వంతెన ప్రమాద స్థితిలో ఉంది. వంతెనకు పునాదులైన దిమ్మెలు బీటలు వారి కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. భారీ వాహనాల రద్దీ పెరగటంతో వంతెన ఉనికికే ప్రమాదం నెలకొంది. అయినప్పటికీ రోడ్లు భవనాల శాఖ అధికారులు గానీ, డ్రైనేజీ అధికారులు గానీ చర్యలు తీసుకోవటం లేదు. ముఖ్య కూడలి ప్రదేశంలో ఉన్న ఈ వంతెన స్లాబులో ఇనుముకు కూడా తుప్పు పట్టింది. ఈ వంతెనపై నిరంతరం వాహనాల రాకపోకలు సాగుతూనే ఉంటాయి. భీమవరం, ఆపై ప్రాంతాల నుంచి మచిలీపట్నం వైపు వెళ్లే వాహనాలకు ఈ వంతెన వారధిలాంటిది. చిన్నపాటి మరమ్మతుల పట్ల అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ఈ వంతెన దిమ్మలకు మరమ్మతు చేయించి ముప్పు తప్పించాలని స్థానికులు కోరుతున్నారు.

కల సాకారం దిశగా..

- పోలవరం-యడవల్లి మధ్య తమ్మిలేరుపై వంతెన నిర్మాణానికి అంచనాలు
- నూజివీడు పంచాయతీరాజ్ ఈఈ పరిశీలన

చాట్రాయి, జూలై 3: మండలంలోని పోలవరం, లింగపాలెం మండలం యడవల్లి గ్రామాల మధ్య తమ్మిలేరుపై వంతెన నిర్మాణానికి అంచనాలు రూపొందించేందుకు బుధవారం నూజివీడు పంచాయతీరాజ్ ఈఈ బాపిరెడ్డి క్షేత్ర పరిశీలన చేశారు. ఎన్నికల ప్రచారం సమయంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, గ్రామస్థులు వంతెన నిర్మించాలని మంత్రి పార్థసారథి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌కు విజ్ఞప్తి చేయగా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి పార్థసారథి ఆదేశాలతో పరిశీలనకు వచ్చిన ఈఈ మాట్లాడుతూ ఇక్కడ వంతెన నిర్మాణానికి సుమారు రూ. 5 కోట్లు అవసరమవుతాయని, త్వరలో ఇంజినీరింగ్ సిబ్బంది అంచనాలు తయారు చేస్తారని అన్నారు. డీపీఆర్ తయారు చేసి నిధులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు.





వంతెన నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఈఈ (ఇన్‌సెట్) వంతెన నిర్మాణ ప్రదేశం

70 ఏళ్ల నాటి కల..

పోలవరం- యడవల్లి మధ్య వంతెన నిర్మించాలని స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ప్రజలు కోరుతున్నా కార్యరూపం దాల్చలేదు. విజయవాడ వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందక ముందు ఏలూరు నుంచే సరుకుల రవాణా జరిగేది. అప్పట్లో ఎడ్ల బళ్లపై యడవల్లి, పోలవరం, చాట్రాయి మీదుగా తిరువూరు, విస్సన్నపేట, మధిర ప్రాంతాలకు సరుకుల రవాణా జరిగేదని పెద్దలు చెబుతుంటారు. బ్రిటిష్ హయాంలోనే ఈ రూట్‌లో మెటల్ రోడ్డు నిర్మించినట్లు చెబుతారు. తిరువూరు తొలి ఎమ్మెల్యే పేట బాపయ్య ఇక్కడ వంతెన నిర్మించాలని కృషి చేశారని, ఒకసారి ఎడ్ల బండిపై ఇక్కడికి వచ్చి పరిశీలించారని వృద్ధులు చెబుతారు. ఎంతో మంది ఎమ్మెల్యేలు, మంత్రు లు, ఎంపీలు తమ్మిలేరును పరిశీలించి వంతెన నిర్మాణానికి హామీలిచ్చినా నెరవేర్చలేదు. ఇక్కడ వంతెన నిర్మిస్తే చాట్రాయి మండలం నుంచి జిల్లా కేంద్రం ఏలూరుకు దగ్గర దారి ఏర్పడటంమే కాక వ్యవసాయ ఉత్పత్తుల రవాణా జరిగి రైతులకు మేలు జరుగుతుంది. ఇంత కాలానికి వంతెన నిర్మాణం గురించి కదలిక రావటంతో రెండు మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మంత్రిని కలసిన బాధితులు

పట్టాలిప్పించాలని మంత్రికి వినతి

ఆగిరిపల్లి, జూలై 3: ఆగిరిపల్లిలో 40 ఏళ్లుగా స్థలాలు ఆక్రమించుకుని నివాసం ఉంటున్న కొందరికే గత ప్రభుత్వం పట్టాలిచ్చిందని, తమకు కూడా పట్టాలివ్వాలని బుధవారం పలువురు లబ్ధిదారులు నూజివీడులో మంత్రి పార్థసారథిని కలసి విజ్ఞప్తి చేశారు. ఆయన ఎమ్మార్వో మృత్యుంజయరావుతో దీనిపై నివేదిక ఇవ్వమని ఆదేశించగా పత్రాలు పరిశీలించి మంత్రికి నివేదిక ఇస్తామని ఎమ్మార్వో తెలిపారు.



ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు

మండవల్లి, జూలై 3: ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని మానకుంటే భావితరాల మనుగడ, పర్యావరణం ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఏలూరు జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి. అప్పారావు అన్నారు. బుధవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినం సందర్భంగా మండవల్లిలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఐక్యవేదిక కోశాధికారి బందారు వెంకయ్య, బండి రంగారావు, హెచ్ఎం రంగనాథస్వామి తదితరులు పాల్గొన్నారు.



మామిడి మొక్కల పంపిణీ

ముసునూరు, జూలై 3: అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినం పురస్కరించుకుని ముసునూరు ప్రేరణాలయ సోషల్ డెవలప్‌మెంట్ సెంటర్ బుధవారం మామిడి మొక్కలను పంపిణీ చేసింది. సెంటర్ డైరెక్టర్ సిస్టర్ సుధారాణి సుమారు 110 మామిడి మొక్కలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం సమాజానికి హానికరమని, ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపన ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. అలాగే పర్యావరణంలో సమతుల్యత కోసం మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఆర్‌సీఎం చర్చి ఉపదేశకులు కొడవలి బెనర్జీ, ముళ్ళపూడి వెంకటేశ్వరరావు, ప్రేరణాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా మందుల దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



కలిదిండి, జూలై 3 : కలిదిండిలో బుధవారం ఆక్వా మందుల దుకాణాలపై మత్స్యశాఖాధికారులు, టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించింది. పలు దుకాణాల్లో నిషేధిత యాంటీ బయోటిక్స్‌ను గుర్తించి రూ.1.50 లక్షలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఫిషరీష్ ఏడీ చాంద్ బాషా మాట్లాడుతూ ఆక్వా మందుల దుకాణాల్లో నిషేధిత యాంటీ బయోటిక్స్ మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్వా మందుల షాపులకు ఖచ్చితంగా లైసెన్స్ ఉండాలన్నారు. గడువు ముగిసిన లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలన్నారు. నాసిరకం మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపెడా టెక్నికల్ అధికారి సురేష్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, మత్స్యశాఖాభివృద్ధి అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ షేక్ హబీబ్ బాషా హెచ్చరించారు. ముదినేపల్లి మండలంలోని పలు ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన ఏడీఏ వెంకటమణి, ఏవో వేణు మాధవ్‌తో కలసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విక్రయాల రికార్డులను పరిశీలించారు. ముదినేపల్లిలోని వరుణ్ సీడ్స్ షాపులో అమ్మకాలకు సంబంధించిన సరైన రికార్డులు చూపకపోవటంతో ఆ షాపులోని రూ.22 వేల విలువైన 5 క్వింటాళ్ల వరి విత్తనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ రైతులను మోసం చేసే వ్యాపారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన ముదినేపల్లి, పెయ్యేరు, పేరూరు, సింగరాయపాలెం, శ్రీహరిపురం గ్రామాల్లో భూసారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట సాగు చేసిన భూములను పరిశీలించారు. జిల్లాలో 6367 క్వింటాళ్ల జీలుగ, 2566 క్వింటాళ్ల పిల్లి పెసర, 2655 క్వింటాళ్ల జనుము విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నందున వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు.

రహదారి అభివృద్ధికి వినతి



తెలంగాణ మంత్రి పొంగులేటితో బసవారెడ్డి

చాట్రాయి, జూలై 3: తెలంగాణ పరిధిలోని కందుకూరు నుంచి చాట్రాయి మండలం చిన్నంపేట వరకు గల రహదారిని అభివృద్ధి చెయ్యాలని, తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి కలిసి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఖమ్మంలో మంత్రిని కలిసి విజ్ఞప్తి చేయగా ఆయన సానుకూలంగా స్పందించారని, ఈ రోడ్డు అభివృద్ధి జరిగితే చాట్రాయి మండలం నుంచి సత్తుపల్లి, ఖమ్మం, హైదరాబాద్ పట్టణాలకు వెళ్ళటానికి ప్రజలకు అనువైన రహదారి సౌకర్యం ఏర్పడుతుందన్నారు.



ముదినేపల్లిలో మెకానిక్స్ డే

ముదినేపల్లి, జూలై 3 : మెకానిక్స్ డేని బుధవారం ముదినేపల్లిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గురజ రోడ్ సెంటర్‌లో మండల మెకానిక్‌లు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.లక్ష్మీనరస కుమారి, టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ పాల్గొని కేక్ కట్ చేశారు. తమకు ఇళ్ల స్థలాలు, బ్యాంక్ రుణాలు ఇప్పించాలని తహసీల్దార్‌కు మెకానిక్‌లు అర్జీని అందజేశారు. అనంతరం సంఘ నాయకులు చిలుకోటి నాగరాజు, బాజానీ ఆధ్వర్యంలో మెకానిక్‌లు బైక్ ర్యాలీ నిర్వహించారు.



డయేరియాపై ప్రజలకు అవగాహన

చాట్రాయి, జూలై 3: మండలంలోని చిత్తపూరు అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్థులకు డయేరియా నివారణపై వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, డయేరియా లక్షణాలు కన్పిస్తే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సీహెచ్‌వో వీరాస్వామి, ఏఎన్ఎం సామ్రాజ్యం సూచించారు. టీడీపీ నాయకులు కొత్తపల్లి రామదాసు, బేతిన వీర రాఘవయ్య, జయరాజు, జనసేన నాయకులు వలసపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కేటగిరీలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్



నూజివీడు టౌన్, జూలై 3: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు మూడో రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సైనిక సంతతి విభాగానికి చెందిన 57 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 49, ఎన్‌సీసీ విభాగంలో 101 మంది, క్రీడా విభాగంలో 180, దివ్యాంగుల విభాగంలో 248 మంది మొత్తం 579 విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న మండవ బసవేశ్వరరావు

నైపుణ్యతతో మెరుగైన అవకాశాలు

నూజివీడు టౌన్, జూలై 3: విద్య, నైపుణ్యతతోనే మెరుగైన అవకాశాలుంటాయని ఏపీ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సెక్రటరి ప్రొఫెసర్ మండవ బసవేశ్వర రావు అన్నారు. నూజివీడు శ్రీ సిద్దార్థ ఫార్మసీ కళాశాలలో ఏపీ అకాడమీ ఆఫ్ సైన్సెస్, కృష్ణా వర్శిటీ సంయుక్త ఆధ్వర్యంలో నీడ్ అండ్ రోల్ ఆఫ్ నెక్స్ జనరేషన్ థెరపిటిక్స్ అనే అంశంపై బసవేశ్వరరావు అధ్యక్షత న జరిగిన అంతర్జాతీయ సదస్సులో ముఖ్య అతిథులుగా పెన్సిల్వేనియా పెన్ యూనివర్శిటీ ప్రొఫెసర్ అరుణ్ కె.శర్మ, సెలీనియమ్ ఆవశ్యకత, ఉపయోగాలను విద్యార్థులకు వివరించగా, నాగాల్యాండ్ వర్శిటీ ప్రొఫెసర్ దీపక్ సిన్హా, ఉపాసన బోరా సిన్హా రీసెర్చ్‌లో మహిళల పాత్రపై వివరించారు. రాష్ట్రంలోని వివిధ ఫార్మసీ కళాశాలలకు చెందిన 100 మందికి పైగా అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సిద్ధార్థ ఫార్మసీ కళాశాల డైరెక్టర్ మేడా మోహన్‌రావు, ప్రిన్సిపాల్ జి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ముసునూరు, జూలై 3: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి షకీనా ఇవాంజలి అన్నారు. ముసునూరులో బుధవారం జరుగుతున్న ఫీవర్ సర్వేను ఆమె తనిఖీ చేసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, నిల్వ ఆహారం తీసుకోవద్దని, వేడి ఆహారం భుజించాలని, దోమ తెరలు వాడుకోవాలని, పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకో వాలని సూచించారు. ముసునూరు పీహెచ్‌సీ పరిధిలో డయేరియా, డెంగీ కేసులు లేవని, అక్కడక్కడ సాధారణ జ్వర పీడితులున్నారని, వారికి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. జ్వరం, వాంతులు, విరేచనాలు తదితర అనారోగ్య సమస్యలుంటే వెంటనే పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

నేడు విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయాలి

ముసునూరు, జూలై 3: గురువారం విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి గరికే అఖిల్ పిలుపునిచ్చారు. బుధవారం ముసునూరులో విలేకర్లతో మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌ని వ్యతిరేకిస్తూ అన్ని విద్యాసంఘాలు ఐక్యతతో ఈ బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. నీట్ ఎగ్జామ్ నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టీఏ) ప్రారంభించినప్పటి నుంచి అవకతవకలకు పాల్పడుతూనే ఉందని, దీనికి వ్యతిరేకంగా జరిగే బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు మద్దతు తెలపాలని కోరారు. ముసునూరు కార్యదర్శి గోపి, నాయకులు బుచ్చిబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకుల్లో సూపర్ క్లోరినేషన్



ముసునూరు, జూలై 3: గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. ముసునూరులోని ఐదు ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి సరఫరా అయ్యే నీటిని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శాంపిల్స్ తీసి రెండు రోజుల క్రితం పరీక్షలు చేయగా తక్కువ శాతం నీరు కలుషితమైనట్టు నివేదికలు వచ్చాయి. దీంతో బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రసాద్, సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా ఆధ్వర్యంలో బీసీ ఏరియాలో ఉన్న మూడు ట్యాంక్‌లు, ఎస్సీ ఏరియాలో ఉన్న రెండు ట్యాంక్‌లను సూపర్ క్లోరినేషన్ చేయించారు. అలాగే పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందే అవకాశం ఉన్నందున స్వచ్ఛమైన మంచినీటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఏఈ తెలిపారు. జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు కార్యదర్శులు, సర్పంచ్‌లు చర్యలు చేపట్టారు. దోమల నివారణ మందును పిచికారీ చేయించి, మురుగునీరు నిల్వ ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లించారు. పారిశుధ్య పనులను ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

డ్రెయిన్లలో పూడిక తొలగింపు

నూజివీడు టౌన్, జూలై 3: వర్షాకాలం నేపథ్యంలో మున్సిపల్ శానిటరీ సిబ్బంది డ్రెయిన్‌లలో పూడికతీత కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో విజయవాడ రోడ్డులో గల రాజీవ్ సర్కిల్, 14వ వార్డులో ఈ పూడికతీత కార్యక్రమాన్ని నిర్వహించారు.

గాంధి బ్యాంకుపై ఆరోపణలు - వివరణ

బ్యాంకు ఖాతాదారులకు, డిపాజిట్ దారులకు పత్రికాముఖంగా తెలియ చేయు నది ఏమనగా, గత కొంత కాలంగా కొంతమంది అసమ్మదీయులు నిరాధారమైన నిందా పూర్వకమైన ఆరోపణల కథనాలను ప్రచారం చేయిస్తూ ఖాతాదారులకు ఒప్పును తప్పు అనేలా ప్రభావితం చేశారు.

మన బ్యాంకుపై వస్తున్న ఆరోపణలలో నిజం లేదని, బ్యాంకులో ఎలాంటి ఆర్థిక అవకతవకలు జరగడం లేదని మనవి చేస్తున్నాము.

గతంలో విజయవాడలో దశాబ్దాలుగా పనిచేస్తున్న ఒక సహ కార బ్యాంకు డైరెక్టరు మనపై ఆరోపణలు చేసిన విధంగానే ఆ బ్యాంకుపై కూడా అసత్య ప్రచారం చేసి ఆ బ్యాంకును నాశనం చేసినట్లే, ప్రస్తుతం అవే శక్తులు మన బ్యాంకుపై కూడా నిందా పూర్వకమైన ప్రచారాలను చేస్తు న్నాయి. మధ్య, దిగువ మధ్య తరగతి ప్రజలకు సేవ చేస్తున్న సహకార వ్యవస్థను నాశనం చేయాలని పూనుకున్న కొన్ని దుష్టశక్తుల ప్రచారాన్ని నమ్మవద్దు.

ఆరోపణ - నిజాలు

ఈ సంవత్సరం జనవరి మాసంలో రిజిస్ట్రారు వారికి ఇద్దరు బ్యాంకు డైరెక్టర్లు, మరియు కొంత మంది సభ్యుల పేర్లతోను, మరణించిన వారి పేరుతోను ఫోర్జరీ సంతకాలు చేసి బ్యాంకుపై పెట్టిన పిటిషన్లపై సహకార శాఖ అధికారులు చేసిన విచారణలో పిటిషన్ అంశాలు వాస్తవాలు కాదని తేలింది.

సహకార వ్యవస్థ పర్యవేక్షణలో

బ్యాంకు పూర్తి ఆర్థిక సౌష్టవంతో ప్రతి సంవత్సరం లాభాలు గడిస్తూ, సభ్యులకు డివిడెండ్ చెల్లిస్తున్నది. ప్రతి సంవత్సరం బ్యాంకు లావాదేవీలను రిజర్వ్ బ్యాంకు వారు తనిఖీ చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సహకార శాఖ అధికారులు బ్యాంకు కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు.

ఆర్‌బిఐ వారి ఇన్సూరెన్స్

సభ్యుల డిపాజిట్లకు రిజర్వ్ బ్యాంకు వారి ఇన్సూరెన్స్ సౌకర్యం కలదు. డిపాజిటర్ల తరపున బ్యాంకు వారు ఇన్సూరెన్స్ ప్రీమియం క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. కావున సభ్యుల డిపాజిట్లకు ఎలాంటి ధోకా లేదని మనవి చేయుచున్నాము.

బ్యాంకు కార్యకలాపాలలో ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేదు. బ్యాంకును అస్థిరపరచాలని ప్రయత్నిస్తున్న దుష్ట శక్తుల పన్నాగాలను సాగనీయవద్దని, **96 సంవత్సరాల చరిత్ర కలిగిన బ్యాంకుపై చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని మనవి.**

బ్యాంకు సభ్యులు మరియు డిపాజిటర్లు తమ సందేహాల నివృత్తికి బ్యాంకు పనివేళలలో సి.ఇ.ఓ. లేదా సంబంధిత బ్రాంచి మేనేజర్లను సంప్రదించగలరు.

వి. వెంకట్రావు, చైర్మన్ మరియు పాలకవర్గ సభ్యులు

ది గాంధి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., No. H. 948
మ్యూజియం రోడ్, గవర్నరు పేట, విజయవాడ-2, ఫోన్ నెం. 0866-2433379

Advertisement